Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయుడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 233 | హైదరాబాద్ | సోమవారం 06 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# చొరవ తీసుకోండి..

## మెట్రో రైల్ ఫేజ్ తక్షణమే ఆమోదం ఇవ్వండి.. ఫేజ్ తెలంగాణకు అప్పగించండి

### కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ

### మెట్రోపై వ్యక్తిగతంగా జోక్యం చేసుకోండి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మరో లేఖలో సీఎం వినతి



హైదరాబాద్, జూలై 5 : మెట్రో రైల్ ఫేజ్ -2 నిర్మాణం పై వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని, వెంటనే ఆమోదం ఇవ్వాలని కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని, ఒకవేళ ఆలస్యమైతే, ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే ప్రమాదముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రోపై వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మరో లేఖలో విన్నవించారు. మనోహర్ లాల్ ఖట్టర్‌కు రాసిన లేఖలో ఫేజ్-1ను తెలంగాణకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థించారు. ప్రస్తుతం అమలులో ఉన్న హైదరాబాద్ మెట్రో ఫేజ్ తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థించారు. ఆలస్యం చేయడం వల్ల ప్రాజెక్టు అమలు దెబ్బతింటుందని, వ్యయం కూడా గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని లేఖల్లో ప్రత్యేకంగా వివరించారు. గత నెల జూన్ 24వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డితో పాల్గొన్న సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1, ఫేజ్-2 అంశాలపై విస్తృతంగా చర్చించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ప్రత్యేకంగా గుర్తు చేశా రు. ఆ సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఇప్పటికీ అమలులోకి రాకపోవడం పట్ల సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు.

### ఎస్‌బీఐ క్యాప్స్‌నకు కీలక బాధ్యతలు అప్పగించాలి..

జూన్ 24న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సంస్థ ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్

- మిగతా 2వ పేజీలో



# ఎప్పటికీ అగ్రస్థానంలోనే..

### అమెరికాను ఎట్టిపరిస్థితుల్లోనూ పతనం కానివ్వం

### 'సెల్యూట్ అమెరికా' వేడుకలో అధ్యక్షుడు ట్రంప్ స్పష్టికరణ

వాషింగ్టన్: అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఆనందకరమైన, అద్భుతమైన మైలురాళ్లలో ఒకటిగా అభివర్ణించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాజధాని వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో 'సెల్యూట్ అమెరికా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో

- మిగతా 2వ పేజీలో



# కన్నీటి సంద్రం టెహ్రాన్

- మూడో రోజూ ఖమేనీ అంత్యక్రియల క్రతువు.. తండ్రి భౌతికకాయం వద్ద ముగ్గురు కుమారుల ప్రార్థనలు
- కనిపించని ప్రస్తుత సుప్రీం లీడర్ మోజ్తబా

టెహ్రాన్, జూలై 5: ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ శవపేటిక వద్ద అశేష జనవాహిని కన్నీరు సంద్రంలా పోటెత్తుతోంది. కుటుంబీకులు, ప్రజలు, అధికారుల అశ్రు నయనాలతో భావోద్వేగాలు ఉప్పొంగుతున్నాయి. ఆయనను కడసారి చూసేందుకు టెహ్రాన్‌కు జనం పోటెత్తుతున్నారు. మూడో రోజైన ఖమేనీ అంత్యక్రియల క్రతువులో ఇమామ్ ఖమేనీ గ్రాండ్ మొసల్లా ప్రాంగణంలో ఆదివారం ఖమేనీ ముగ్గురు కుమారులు ముస్తఫా, మేసమ్, మసౌద్ తమ తండ్రి శవపేటిక పక్కన చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మసౌద్ ఖమేనీ కన్నీళ్లు పెట్టుకుంటూ విప్లవ ప్రతీక

- మిగతా 2వ పేజీలో



# కాంగ్రెస్ X బీఆర్ఎస్

## నిన్న అప్పులపై సవాళ్లు.. నేడు కాళేశ్వరంపై రగడ

- వేడెక్కుతున్న రాజకీయం
- తగ్గేదేలె అంటున్న పార్టీలు
- కేసీఆర్‌కు వారం అప్పగించండి: కేటీఆర్
- అలా చేస్తే భద్రచలం మునుగుతుంది: ఉత్తమ్


(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నాలుగు రోజులుగా బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్న రీతిలో రాజకీయం నడుస్తోంది. ఎవరికి వారు తగ్గేదేలే అంటూ సవాళ్లు.. ప్రతీసవాళ్లు.. పర్యటనలు చేపడుతూ ఇప్పుడే ఎన్నికల వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నారు. రాష్ట్ర అప్పులపై అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ ఇటు కాంగ్రెస్ మంత్రి జూపల్లి తదితరులు మధ్య సవాళ్లు.. ప్రతిసవాళ్లు నడిచాయి. తాజాగా ఆదివారం కాళేశ్వరం పంపుహౌస్‌కు కేటీఆర్ వెళ్లడం ఉదయం నుంచి హైడ్రామా నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లను తక్షణమే ఆన్ చేసి, ఎగువన ఉన్న రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ.. భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బృందంతో కలిసి మేడిగడ్డ వెళ్లారు. ప్రభుత్వం ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా.. చివరకు అక్కడకు వెళ్లగలిగారని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతాంగానికి నీరందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఈ టూర్‌ను ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేసింది.

### మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్

గోదావరిలోకి భారీగా ఇన్-ఫ్లో వస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై ఉన్న రాజకీయ కక్షతోనే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని కేటీఆర్ మండిపడుతున్నారు. కన్నేపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు సురక్షితంగా ఉన్నాయని, వాటిని ఆన్ చేసి నీటిని పంప్ చేస్తే ఎండిపోతున్న ఆయకట్టుకు ప్రాణం పోయవచ్చని బీఆర్ఎస్ వాదిస్తోంది. కేసీఆర్ నిర్మించిన మహా అద్భుత ప్రాజెక్టును పనికిరానిదిగా చిత్రీకరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంతకు ముందు పలు చోట్ల కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డగించడంతో వారితో వాగ్వాదానికి దిగి.. పంప్‌హౌస్

- మిగతా 2వ పేజీలో



# కట్టింది, కూల్చింది బీఆర్ఎస్సే

-2లో

- కమీషన్ల కోసమే కాళేశ్వరం
- మూడు బరాజ్‌లకు ముప్పుంది..
- కాపాడేందుకు కాంగ్రెస్ చర్యలు
- వచ్చే జూలై వరకు ప్రాజెక్టు పునరుద్ధరణ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



# నేటి నుంచి ప్రధాని మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో పర్యటించబోతున్నారు. ఆయన తొలుత సోమవారం ఇండోనేసియాకు చేరుకుంటారు. 2016 తర్వాత మోదీ ఆ దేశానికి వెళ్తుండడం ఇదే మొదటిసారి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఇండోనేసియా మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, సముద్ర భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటోతో మోదీ సమావేశమవుతారు. ఇరుదేశాల సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. ఇండో-పసిఫిక్‌లో సముద్ర సహకారాన్ని, సరఫరా గొలుసులను పటిష్ఠం చేయడం, ఆర్థిక మరియు వ్యూహాత్మక సంబంధాలు, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, తయారీ రంగంలో సహకారం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలపై చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని

- మిగతా 2వ పేజీలో



# నేడు రామాలయ ట్రస్ట్ భేటీ

### చంపత్ రాయ్ రాజీనామాపై తుది నిర్ణయం

### సిట్ మధ్యంతర విచారణ నివేదికపై చర్చ

అయోధ్య: అయోధ్య రామాలయం శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కీలక సమావేశం సోమవారం జరగనుంది. ఆలయ విరాళాల చోరీ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. చోరీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడి ఆశ్రమంలో జరిగే ఈ భేటీకి ట్రస్ట్

- మిగతా 2వ పేజీలో



# అత్యంత ప్రతిష్టాత్మకంగా 'సర్'

### కాంగ్రెస్ శ్రేణులకు భట్టి దిశానిర్దేశం

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ప్రజాభవన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన కీలక సమావేశానికి హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. "ఓటరు జాబితాలో అన్-మ్యాపింగ్ పేర్లు, సాంకేతిక లోపాలు, ఇంటి పేర్ల మార్పులు, అక్షర దోషాలు లేకుండా బీఎల్ఏలతో కలిసి డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న సానుకూలతను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలి" అని భట్టి

- మిగతా 2వ పేజీలో

# కన్నీటి సంద్రం టెహ్రాన్

(మొదటి పేజీ తరువాయి)

అయిన కఫియాతో తుడుచుకోవడం అక్కడ ఉన్నవారిని కలచివేసింది. కానీ ఖమేనీ మరో తనయుడు, ప్రస్తుత సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ కన్పించలేదు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహ్మద్ బాఖర్ ఖలీబాఫ్ కూడా శవపేటికల వెనుక నిలబడి ప్రార్థనలు చేశారు. ఇరాన్‌లో అయాతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల యాత్ర ఆదివారం మూడో రోజుకు చేరింది. గత ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, పద్నాలుగు నెలల మనవరాలు మరణించారు. వారి శవపేటికలను కూడా ఇక్కడే ఉంచారు. దశాబ్దాల పాటు ఇరాన్‌ను శాసించిన నాయకుడికి నివాళులు అర్పించేందుకు అశేష జనవాహిని తరలివచ్చింది. అయితే ఈ అంత్యక్రియల వేడుకల్లో ఖమేనీ వారసుడిగా ఎంపికైన మరో కుమారుడు మోజ్తబా ఖమేనీ ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ఆయన అంత్యక్రియ ల ప్రాంగణంలో ఎక్కడా ప్రజలకు లేదా మీడియాకు దర్శనమివ్వలేదు. ఇదిలా ఉంటే సంతాపకులు ఖమేనీ మరణం ఇమామ్ హుస్సేన్ అమరత్వం, ప్రతిఘటన, వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ఆయనను తలచుకుంటూ కన్నీటిపర్యంతం అయ్యారు. వారి నినాదాలు, ఎర్ర జెండాలు, కర్బలా స్మరణలు ఆ క్షణాన్ని నిరంకుశత్వానికి వ్యతిరేకంగా షియాల ధిక్కారానికి సజీవ నిదర్శనంగా నిలిపాయి. మరోపక్క ఖమేనీ చివరి చూపు కోసం ఇరాన్ ప్రజలు టెహ్రాన్‌కు పోటెత్తుతున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు టెహ్రాన్ మెట్రో నెట్వర్క్‌లో ఏడు మిలియన్ల మంది ప్రయాణించారని అధికారులు వెల్లడించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమాన్ని మొత్తం ఆరు రోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సోమవారం టెహ్రాన్ కేంద్రంగా భారీ ఊరేగింపు సాగనుంది. మంగళవారం షియా ముస్లింల పవిత్ర నగరమైన కోమ్‌కు ఖమేనీ పార్థివ దేహాన్ని తరలిస్తారు. బుధవారం ఇరాక్ దేశంలోని పవిత్ర నగరాలైన నజాఫ్, కర్బలాలకు ప్రత్యేక విమానంలో తీసుకెళ్తారు. అనంతరం గురువారం ఇరాన్‌లోని మషద్ నగరానికి తీసుకువచ్చి, అక్కడ ఉన్న పవిత్ర ఇమామ్ సమాధి చెంత ఖమేనీ భౌతికకాయాన్ని అంత్యక్రియలు పూర్తి చేసి, ఖననం చేస్తారు. తరలివచ్చే లక్షలాది మంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత రవాణా, భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తోంది.

# నేటి నుంచి ప్రధాని మోదీ విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

వారు సమీక్షిస్తారు. రాజధాని జకార్తాలో ప్రవాస భారతీయులతోనూ మోదీ భేటీ అవుతారు. వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇండోనేసియాలోని ప్రఖ్యాత ప్రాంబనన్ ఆలయాన్ని మోదీ దర్శించుకుంటారు. మోదీ ఇండోనేసియా పర్యటన ముగించుకున్న తర్వాత వెంటనే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించబోతున్నారు. ఇండోనేసియా ప్రస్తుత అధ్యక్షుడు సుబియాంటో గత సంవత్సరం భారత్‌లో పర్యటించారు. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ మాట్లాడుతూ.. అన్-మ్యాపింగ్‌లో ఉన్న పేర్లు 50 శాతానికి పైగా ఉండటం ఆందోళనకరమని, వీటిని బీఎల్ఏలతో కలిసి సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

# నేడు రామాలయ ట్రస్ట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులంతా హాజరు కావాలని ట్రస్ట్ ట్రెజరర్ గోవింద్ కోరారు. వయో సంబంధ సమస్యలతో చికిత్స పొందుతూ శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన 89 ఏళ్ల ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్ సమావేశానికి వస్తారని తెలుస్తోంది. ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసుకునేందుకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈవో)ని నియమించే విషయం చర్చకు రానుంది. ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న గోపాల్ రావు పాత్రపైనా చర్చ జరిగే అవకాశముందంటున్నారు. ఆలయంలో విరాళాల మాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అందజేసిన మధ్యంతర నివేదికలోని అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. ఈ భేటీలో 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఆలయ ఆదాయ వ్యయాల నివేదికను ఆమోదించనున్నారు. ప్రస్తుతం ట్రస్ట్ అధ్యక్షుడు నృత్యగోపాల్ దాస్‌తోపాటు 11 మంది రెగ్యులర్ సభ్యులున్నారు. ఆలయ విరాళాల వ్యవహారంపై ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే వ్యక్తం చేసిన అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు సంస్థ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారం హిందూ సమాజం నమ్మకాన్ని తీవ్రంగా గాయపరిచిందని ఇటీవల హొసబలే పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని కొన్ని శక్తులు హిందూ ధర్మం ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. వీటిని హిందూ సమాజం ఓపిక, నిగ్రహంతో ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ X బీఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)



వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాళేశ్వరం ఈ రాష్ట్రానికి కేసీఆర్ ఇచ్చిన వరం. మీకు చేతకాకపోతే మా కేసీఆర్‌కు ఒక్క వారం రోజులు అప్పగించండి.. నీళ్లు ఎత్తి చూపిస్తాం అన్నారు.

### కుంగిన పిల్లర్ల భయం

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పూర్తిగా తోసిపుచ్చింది. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్ల వల్ల ప్రస్తుతం అక్కడ నీటిని నిల్వ ఉంచడం ప్రమాదకరమని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం జూన్ 2027 నాటికి మాత్రమే పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని స్పష్టం చేస్తోంది. కేటీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఉన్నాయని కొట్టిపారేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు డిజైన్ల వల్లే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ప్రస్తుతం సెంట్రల్ వాటర్ కమిషన్ , ఎన్‌డీఎస్ఏ నిపుణుల ఆధ్వర్యంలో 13 రకాల కీలక సేఫ్టీ టెస్టులు నడుస్తున్నాయి. ఇలాంటి సాంకేతిక పరీక్షల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా మోటార్లు ఆన్ చేసి నీటిని నిల్వ చేస్తే.. దిగువన ఉన్న భద్రాచలంతో పాటు 44 గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయం చేయాలని చూస్తే సహించేది లేదు" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

### ఎవరి వాదన వారిదే..

కాళేశ్వరం విషయంలో ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవడానికి, కేసీఆర్ మార్క్ ప్రాజెక్టును డిఫెండ్ చేసుకోవడానికి చలో మేడిగడ్డ అస్త్రాన్ని ప్రయోగిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం టెక్నికల్ సేఫ్టీ రిపోర్టులను ముందుకు తెచ్చి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, నిర్మాణ లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. మొత్తంగా చూసుకుంటే కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌లు రాష్ట్రంలో రాజకీయం వేడెక్కిస్తున్నారు.

# కట్టింది, కూల్చింది బీఆర్ఎస్సే

## కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు.. మూడు బరాజ్‌లకు ముప్పుంది..

- కాపాడేందుకు కాంగ్రెస్ చర్యలు
- వచ్చే జూలై వరకు ప్రాజెక్టు పునరుద్ధరణ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- బీఆర్ఎస్ నేతలకు ఇంజినీరింగ్‌పై అవగాహన లేదు
- పంపులను ఆన్ చేయాలనడం అవివేకమని విమర్శ



హైదరాబాద్, జూలై 5 : కాళేశ్వరం ప్రాజెక్టును కట్టింది, కూల్చింది బీఆర్ఎస్సే.. కాపాడేది కాంగ్రె స్ ప్రభుత్వమని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన నిర్మాణ లోపాలను దాచిపెట్టి ప్రజల ను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయ త్నం చేస్తుందని దుయ్యబట్టారు. ఆదివా రం సచివాలయంలో నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడా రు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలోని కన్నేపల్లి పంప్‌హౌస్‌ను వెంట నే ప్రారంభించి నీటిని ఎత్తిపోయవచ్చని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. 'పంపులు ఆన్ చేయడం సాధ్యం కాదు.. అసలు చేయలేం. శాస్త్రీ య పునరావాసం పూర్తయ్యే వరకు మూడు బ్యారేజీలను నిర్వహించరాదని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ స్పష్టంగా ఆదేశించింది. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పెట్టే నిర్ణయం ఈ ప్రభుత్వం ఎప్పటికీ తీసుకోదు' అని తేల్చి చెప్పారు. కాళేశ్వరం సమస్యను రాజకీయ కోణం లో కాకుండా ఇంజినీరింగ్ కోణంలో చూడాలని మంత్రి సూచించారు. మూడు బ్యారేజీల పునాదుల పటిష్టతపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) అనుమానం వ్యక్తం చేసిందని, తుది నివేదికలో మేడిగడ్డ, అన్నారం, సుం దిళ్ల బరాజ్‌ల పునాదుల్లో తీవ్రమైన నిర్మాణ లోపాలు ఉన్నట్లు స్పష్టంగా పేర్కొన్నదని మంత్రి తెలిపారు. మూడు బరాజ్‌లపై గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు వంటి అత్యాధునిక పరీక్షలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ పనులను పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్, అంతర్జాతీయ కన్సల్టెంట్ ఏఎఫ్ఆ ర్వై, ఐఐటీ ముంబాయి, ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు వెల్ల డించారు. డిజైన్లను ఖరారు చేసి, వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జూలై 2027 నాటికి పనులు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అప్పటి వరకు మూడు బ్యారేజీలను ఫ్రీ-ఫ్లో స్థితిలోనే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. లోపాలను సరిచేయకుండా నీటిని నిల్వ చేస్తే భద్రాచలం సహా దిగువ ప్రాంతాల్లో తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు.

### బీఆర్ఎస్‌వి రాజకీయ, వాణిజ్య ప్రయోజనాలు..

ప్రాణహిత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన అసలు ప్రాణహిత ప్రాజెక్టును అమలు చేసి ఉంటే ఉత్తర తెలంగాణకు గ్రావి టీ ద్వారా సుమారు 80 టీఎంసీల స్థిర నీటి భద్రత లభించేదని తెలిపారు. రాజకీయ, వాణి జ్య ప్రయోజనాల కోసం ప్రాజెక్టు రూపకల్పనను మార్చడం వల్లే నేడు ఈ పరిస్థితి ఏర్ప డిందని విమర్శించారు. ప్రాణహిత అసలు రూపం అమలై ఉంటే ఎల్ నినో వంటి పరిస్థితుల్లో కూడా ఉత్తర తెలంగాణ ఇబ్బందులు ఎదుర్కొనేది కాదని ఆయన చెప్పారు. కాళేశ్వరం పునరుద్ధరణతో పాటు తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా సుమారు 80 టీఎంసీల నీటిని తెలంగాణకు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికను వేగవంతం చేసిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ, సాగునీరు, తాగునీటి రంగాల్లో ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేస్తోందని మంత్రి తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కా ర్యదర్శి శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజనీర్-ఇన్-చీఫ్ (జనరల్), సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చొరవ తీసుకోండి..

(మొదటి పేజీ తరువాయి)

లిమిటెడ్ (ఎస్బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీకి అవసరమైన ఆర్థిక పరిశీలన వంటి కీలక బాధ్యతలు అప్పగించాలని అంగీకరించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రస్తుతం ఫేజ్-1పై ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే (రిఫైనాన్సింగ్) అవకాశాలను కూడా ఎస్బీఐ క్యాప్స్ పరిశీలించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎస్బీఐ క్యాప్సనకు బాధ్యతలు అప్ప గించాలని నిర్ణయించినప్పటికీ, ఇప్పటివరకు ఆ సంస్థను అధికారికంగా నియమించలేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో అనిశ్చితి నెలకొనడంతో పాటు రోజు వారీ నిర్వహణలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎస్బీఐ క్యాప్స్ నియామ కం ఆలస్యం కావడం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు (డీపీఆర్‌లు) కేంద్ర అనుమతులు రావడం మరింత ఆలస్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ముందుకు సాగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వాపోయారు.

### ఫేజ్ సమగ్ర ఆర్థిక వ్యూహం అవసరం..

మెట్రో ఫేజ్ భారీ స్థాయిలో నిధులు అవసరమవుతాయని, అందువల్ల ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాల సమీకరణ, నిధుల సమీకరణ మార్గాలు, ఆర్థిక వ్యూహం కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్లు సీఎం వివరించారు. ఫేజ్‌హా ప్రాజెక్టు విలువ నిర్ధారణ, రుణాల పునర్వ్యవస్థీకరణ, ఫేజ్-2 నిధుల సమీకరణ వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించేలా టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) రూపొందించాలని కేంద్రాన్ని కోరారు. ఈ ప్రక్రియ సమన్వయం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించిందని కూడా లేఖలో గుర్తు చేశారు.

### మెట్రో భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ విషయంలో వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆయనకు రాసిన లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ఇకపై మరింత ఆలస్యం కాకుండా చూడాలని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రైల్వే శాఖలతో స్వయంగా మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1ను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటని సీఎం వివరించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్-1 తెలంగాణ ప్ర భుత్వానికి బదిలీ కాగా, ఫేజ్-2 వేగంగా అ మలైతే నగర ప్రజారవాణా వ్యవస్థ మరిం త బలోపేతం అవుతుందని, హైదరాబాద్ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వ యం చేయాలని, ఎస్బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించి టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ను ఖరారు చేయించాలని సీఎం చేశారు. అలా జరిగితే మెట్రో ఫేజ్-1 బదిలీ ప్రక్రియ వేగంగా పూర్తవడంతో పాటు, ఫేజ్-2 విస్తరణ పనులు కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎప్పటికీ అగ్రస్థానంలోనే..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న యోధులతోపాటు పలువురు ప్రముఖులను సత్కరించారు. వియత్నాం యుద్ధరంగంలో ప్రత్యేక దళాలకు నాయకత్వం వహించిన తొలి నల్లజాతి అధికారిని సన్మానించారు. తనదైన శైలిలో ప్రసంగిస్తూ జనాన్ని ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. కమ్యూనిజంపై విమర్శలు ఎక్కుపెట్టారు. మనం ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉంటామని అమెరికన్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అమెరికాను ఎట్టిపరిస్థితుల్లోనూ పతనం కానివ్వబోమని తేల్చిచెప్పారు. తాము ఎల్లప్పుడూ అత్యుత్తమంగానే ఉంటామన్నారు. 'సేవ్ అమెరికా చట్టాన్ని' ఆమోదించాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. "రోజు మన దేశం మళ్లీ విజయం సాధిస్తోంది. మునుపెన్నడూ లేనంత గొప్పగా పునరాగమనం చేసింది. మనం అమెరికాను గొప్పగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సేవ్ అమెరికా చట్టాన్ని ఆమోదించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధిస్తాం. దీని ప్రకారం ఓటర్లందరూ తమ ఓటరు గుర్తింపు కార్డును చూపించాలి. అలాగే పౌరసత్వానికి సంబంధించిన రుజువును తప్పనిసరిగా సమర్పించాలి" అని ట్రంప్ తేల్చిచెప్పారు.

### ఇది నాకు 'మూడో పర్యాయం'

మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికవుతానని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. తన హయాంలో అమెరికా సైన్యం ఎన్నో విజయాలు సాధించిందని హర్షం వ్యక్తంచేశారు. దేశ సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నానని వివరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ను ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడారు. తన ప్రస్తుత అధ్యక్ష పదవీకాలాన్ని 'రెండో పర్యాయం' అని కాకుండా 'మూడో పర్యాయం' అని పిలిచి ఉండాల్సిందని చెప్పారు. 2020 నాటి ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, అందుకే బైడెన్ గెలిచారని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. వాస్తవానికి ఆ ఎన్నికల్లో విజయం తనదేనని అంటున్నారు. ప్రపంచంలోనే అత్యంత బలమైన, శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదగడం చరిత్రలో యాదృచ్?ఛకంగా జరిగిన పరిణామం కాదని ట్రంప్ తేల్చిచెప్పారు. అధ్యక్షుడిగా తన మొదటి పదవీ కాలంలో సైన్యాన్ని గొప్పగా పునరి?నరి?మంచామని అన్నారు. వాస్తవానికి సైన్యాన్ని మూడో పదవీకాలంలో ఉపయోగిస్తామని చెప్పాలని వెల్లడించారు. కానీ, అలా చెప్పే ఉద్దేశం లేదన్నారు. వివాదానికి ఆస్కారం కల్పించడం తనకు ఇష్టం లేదన్నారు.

### స్వర్ణయుగానికి ఆరంభం మాత్రమే

ఎంతోమంది వీరుల త్యాగంతో అమెరికా జెండా ఎల్లప్పుడూ స్వేచ్ఛ, న్యాయాలకు చిహ్నంగా నిలుస్తోందని ట్రంప్ అన్నారు. చరిత్రకు సాక్షిగా నిలిచిన పలు అమెరికా జాతీయ జెండాలను నేషనల్ మాల్‌లో ప్రదర్శించారు. అమెరికా తొలినాటి జెండా కూడా ఇందులో ఉంది. 1777 నాటి జెండాను ట్రంప్ చూపించారు. అప్పట్లో 13 రాష్ట్రాలకు ప్రతీకగా 13 నక్షత్రాలు, 13 పట్టీలు ఉన్న జెండా అని చెప్పారు. యార్క్‌టౌన్ యుద్ధ సమయంలో విజయగర్వంతో రెపరెపలాడిన నక్షత్రాలు, పట్టీల జెండాను గుర్తుచేసుకున్నారు. నిరంకుశత్వంపై స్వేచ్ఛ సాధించిన విజయాన్ని, అణచివేతపై స్వాతంత్ర్యం పొందిన ఆధిక్యతను 1776 జూలై 4 నుంచి 2026 జూలై 4 వరకు అమెరికన్ స్ఫూర్తి సాధించిన చిరస్థాయి విజయాన్ని నేడు గొప్ప వేడుకగా నిర్వహించుకుంటున్నామని వివరించారు. అమెరికాను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని ట్రంప్ ప్రతిజ్ఞ చేశారు. "ఇది అమెరికా స్వర్ణయుగానికి ఆరంభం మాత్రమే. రెండున్నర శతాబ్దాల క్రితం నాటి తరహాలోనే ఒక విషయాన్ని ప్రకటిస్తున్నాం. మా దేశం, మా పిల్లల కోసం, స్వేచ్ఛా ఆశయం కోసం మా దేశాన్ని ఎవరూ చేరుకోని సరికొత్త శిఖరాలకు చేరుస్తాం. దేశాన్ని మరింత గొప్పగా, మెరుగ్గా, శక్తివంతంగా తీర్చిదిద్దుతాం. అమెరికాను మరింతగా ప్రేమిస్తాం" అని ట్రంప్ స్పష్టంచేశారు. అనారోగ్యం, వైకల్యం, సైనిక విధి నిర్వహణ లేదా ప్రయాణం వంటి అనివార్య కారణాలు ఉంటే తప్ప ఇకపై పోస్ట్ ద్వారా ఓటు వేసే విధానం ఉండదని చెప్పారు. దాంతో ఎన్నికల్లో మోసాలకు అవకాశం ఉండదని అభిప్రాయపడ్డారు. ఇందులో అర్థం కాని విషయం ఏదీ లేదన్నారు. కమ్యూనిజాన్ని ట్రంప్ మళ్లీ తప్పుపట్టారు. "కమ్యూనిస్ట్ వ్యవస్థ అమెరికన్ వ్యవస్థకు పూర్తిగా భిన్నమైనది. కమ్యూనిస్ట్ వ్యవస్థ ఎప్పుడూ విజయవంతం కాలేదు. ఆ ప్రమాదకరమైన వ్యవస్థ తిరిగి అమెరికాలో తన వికృత రూపాన్ని చూపిస్తామంటే ఇక్కడ ఎవరూ ఒప్పుకోరు. అమెరికా ఎప్పటికీ కమ్యూనిస్ట్ దేశం కాదు" అని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ సర్కారు

- కేంద్ర మంత్రికిషన్‌రెడ్డి
- ఒవైసీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్న

హైదరాబాద్: హైడ్రా పేద ముస్లింల ఇళ్లు కూల్చివేస్తున్నప్పుడు కాంగ్రెస్, మజ్లిస్‌లు నోరెత్తలేదని ఇప్పుడు ఒవైసీ సోదరుల ఆస్తులను కాపాడే విషయంలో మాత్రం 2 పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. "హైడ్రా పేద ముస్లింల ఇళ్లను కూల్చింది. ఆ సమయంలో వారి తరఫున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు కాంగ్రెస్ వెనకాడటం లేదు. పక్షపాత పాలనకు హైడ్రా ఓ ఉదాహరణ. సామాన్యుల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం... సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటోంది? హైకోర్టు పలుమార్లు ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరులో మార్పులేదు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదు. తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోంది" అని కిషన్‌రెడ్డి అన్నారు. ఒవైసీకి చెందిన ఫాతిమా విద్యాసంస్థలపై హైకోర్టు ప్రశ్నలు సంధిస్తున్నా ప్రభుత్వం వివరణ ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. భాజపా అధికారంలోకి వస్తే ఫాతిమా విద్యాసంస్థలను కూల్చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ఈ మేరకు సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "అక్బరుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్ అండతోనే హైకోర్టునే బెదిరించేలా హద్దులు మీరి మాట్లాడుతున్నారు. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలను కూల్చేస్తామం టూ నోటీసుల మీద నోటీసులిస్తున్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి సర్కారు ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం ఇతరులకు ఇంకో న్యాయమా? భాజపా అధికారంలోకి వస్తే అక్రమార్కులకు భయమంటే ఏమిటో చూపిస్తాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు ఇల్లందు ) జూలై 05**

ఇల్లందు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వార్డు కమిటీలు కీలకంగా వివరించాలని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బొళ్ళ సూర్యం లు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు వార్డు కమిటీ సభను కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో వార్డు కమిటీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వార్డులోని ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డులో ఎలాంటి సమస్య ఉన్న ప్రజల చెంతకు వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, 20 వార్డు కౌన్సిలర్ జాఫర్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, పట్టణ మహిళా అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు పెద్దబోయిన శ్వేత, కాంగ్రెస్ నాయకులు మహబూబ్, లక్ష్మీనారాయణ, ఆలేటి చిన్ని, ఝాన్సీ, సతీష్ కుమార్ పాసి, మాదాసు సుమన్, పొట్ల శ్రీను,చైతన్య, గంటాడి విజయ్, భరత్, ప్రసాద్, నాయిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ ప్రవేశాలకు నేడు స్పాట్ కౌన్సిలింగ్..

### తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.. టిఇపిఏ వ్యవస్థాపకుడు దార మధు

**మంథని, జూలై-05 (ప్రజాతీర్పు)**



పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం మిగిలిన సీట్ల భర్తీకి నేడు జూలై 6 స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకుడు దార మధు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలోని మంథని, పెద్దపల్లి బాలుర గురుకుల కళాశాలలు, రామగుండం, మల్లాపూర్, నందిమేడారం, గర్రెపల్లి బాలికల గురుకుల కళాశాలల్లో మిగిలిన బైపిసి, ఎంపిసి, సిఇసి, హెచ్ఇసి కోర్సుల సీట్ల భర్తీ కోసం ఈ స్పాట్ కౌన్సిలింగ్‌ను మంథనిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలుర లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి, అనంతరం కౌన్సిలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి మార్కుల మెమో, ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కౌన్సిలింగ్ కేంద్రానికి హాజరు కావాలని దార మధు సూచించారు. ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య, వసతి, భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

- నమ్మించి మోసం చేసిన బిల్డర్ పైన కఠిన చర్యలు..
- అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి..
- ఎవ్వరు అడ్డు వచ్చినా వెనక్కు తగ్గేది లేదు..
- ప్రతి ప్లాట్ యజమానికి సంపూర్ణ న్యాయం



**పటాన్ చేరు జూలై 5 ప్రజాతీర్పు ప్రతినిధి**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు ఆదివారం సాయంత్రం కొల్లూరులో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984వ సంవత్సరంలో కొల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 173 నుండి 190 పరిధిలోగల 142 ఎకరాలలో భవిష్యత్తు అవసరాల కోసం 1500 ల మంది వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లు కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తదనంతరం కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో తిరిగి ప్లాట్లను అమ్మడంతో పాటు. ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం అన్నారు. బిఎల్ ప్రసాద్ అనే ప్లాట్ యజమాని సభ్యులందరినీ మోసం చేసి ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను కబ్జా చేసి హెచ్ఎండిఏ అనుమతులతో నిర్మాణాలు కొనసాగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ తో పాటు, సిటీ ప్లానర్, హెచ్ఎండిఏ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి అనుమతిని రద్దు చేయించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. రూపాయి రూపాయి పొదుపు చేసి ప్లాట్లను కొనుగోలు చేస్తే.. నేడు కొందరు భూ ఆక్రమణదారులు ఇలాంటి చర్యలకు పాల్పడం సిగ్గు చేటని విమర్శించారు. ఈ ఆక్రమణల్లో ఎంతటి పెద్దవారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ప్రతి ఫ్లాట్ యజమానికి పూర్తి న్యాయం దక్కేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు ప్రతి ప్లాటు సభ్యుడు సమిష్టిగా పోరాటం చేసినప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నరసింహ, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, మధు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం

- ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జూలై 5**





రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన పెంకుటిల్లు ఉన్నవారికి, సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని, భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, 1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని, 1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపారస్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని గ్రామాలలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. మురుగు కాలువలలో మ్యాజిక్ సోక్ ఫీట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జల శాతాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఏర్పడిన గందరగోళంలో ఎలాంటి వాస్తవం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా పిల్లలతో అబద్ధాలు చెప్పించారని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యా సంస్థలలో ఈ సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 3 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధి ప ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యాసంస్థలలో సి.సి. కెమెరాల తో పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులకు 200 శాతం కాస్మోటిక్, 40 శాతం డైట్ చార్జీలు పెంచి అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు, అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతుందని, ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటుచేసి శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు నిర్మించుకున్న ఇంటిని జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు మరో 2 వేల ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత గల ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పెంకుటిల్లు లేకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండే విధంగా ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని, పెంకుటిల్లు గల అర్జీదారులు చేసుకున్న దరఖాస్తును మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పరిశీలించి ఫోటోలు తీసుకుని అర్హత ప్రమాణాలు పరిశీలించి ఇల్లు కేటాయించాలని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా అరికట్టడంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ

- జిల్లాలో 1.81 లక్షల మందికిపైగా రైతులకు రూ.222.42 కోట్ల పెట్టుబడి సాయం
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 05(ప్రజాతీర్పు ):**



వానాకాలం--2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద నిర్మల్ జిల్లాలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని నేరుగా జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 4వ తేదీ నాటికి జిల్లాలో 1,81,379 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.222.42 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. సాగు ప్రారంభ దశలోనే రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టేందుకు అవసరమైన ఆర్థిక చేయూత అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిధుల విడుదల కొనసాగుతోందని పేర్కొన్నారు.ముథోల్ నియోజకవర్గంలో 85,468 మంది రైతులకు రూ.118.34 కోట్లు, ఖానాపూర్ నియోజకవర్గంలో 62,632 మంది రైతులకు రూ.75.31 కోట్లు, నిర్మల్ నియోజకవర్గంలో 63,752 మంది రైతులకు రూ.69.37 కోట్లు వారి ఖాతాల్లో జమ అయినట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణతో చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సాంకేతిక లేదా పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.



## ప్రాణధార చిల్డ్రన్స్ & నైరా ఫెర్టిలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మల్లారెడ్డి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి

**చింతల్, జులై, 5 (ప్రజా తీర్పు )**

చింతల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాణధార చిల్డ్రన్స్ హాస్పిటల్ మరియు నైరా ఫెర్టిలిటీ హాస్పిటల్లను మల్లారెడ్డి యూనివర్సిటీ, మల్లారెడ్డి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రులను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. అలాగే సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు ఐవీఎఫ్ (×ఎఫ్) వంటి ఆధునిక చికిత్సల ద్వారా ఆశాజనక ఫలితాలు అందించవచ్చని తెలిపారు. సంతానం కోసం ప్రయత్నిస్తున్న దంపతులు ఎలాంటి సందేహాలు లేదా ఆరోగ్య సమస్యలు ఉన్నా ఆసుపత్రిని సంప్రదించాలని, నిపుణులైన వైద్యులు వారికి పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, సూచనలు అందించి తగిన చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ వెంకట్ రాంరెడీ, సీఈఓ డాక్టర్ స్వాతి,యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆగస్టు 2 న ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహా సభలను జయప్రదం చేయండి.

- మేకల దాసు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

**(వి వెంకటేష్ ప్రయా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జులై 5**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఏఐటీయూసీ,సిపిఐ కార్యాలయం లో పోస్టర్ విడుదల చేసి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి ట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ భారతదేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలోనే దేశంలోని కార్మికులను ఐక్యపరిచి 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఏఐటీయూసీ అవిర్భవించింది. నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నడుతువుంది. కనీస వేతనాలు చట్టం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు ఏఐటీయూసీ పోరాటాల వల్లనే వచ్చినవి. ఎన్నో పోరాటాలు చేసి సాధించుక్కు కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడి దారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారు. కనీస వేతనాలు పిఎఫ్,ఈఎస్ఐ, చట్టాలు అమలుకు నోచుకోలేదు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారు. అంగన్వాడి ఏఎన్ఎం, ఆశ,ఆర్టీసీ మధ్యాహ్న భోజనం, జీపు కారు 104, 108, హాస్పిటల్ కార్మికులు, హమాలీ, ఆటో, భవన నిర్మాణ రంగం గ్రామ పంచాయతీ కార్మికులు, లారీ డ్రైవర్లు, పెయింటింగ్, సెంట్రింగ్, టైల్స్, మార్బుల్ మరియు ఇతర రంగాల కార్మికుల వేతనాలు పెరగక ఉపాధి దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్లను రద్దు చేయాలన, కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి శాంతి గాని, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి మైన్ ఫిట్ కార్యదర్శి రత్నం ప్రవీణ్, దాడి రమేష్ , జిల్లా సమితి సభ్యులు గుండ మాణిక్యం, రత్నం రాజం, కొంకుల రాజేష్, జాడి పోచం ఏఐటీయూసీ నాయకులు సాకే శ్రీనివాస్, రామకృష్ణ,

# ముప్పుగా మారిన బైపాస్ రోడ్డు

- పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో కుంగిపోయిన రహదారి – ప్రమాదాల పరంపర
- పట్టించుకోని అధికారులపై స్థానికుల ఆగ్రహం...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 5.**



జగిత్యాల పట్టణంలోని రాజీవ్ రహదారి బైపాస్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో రహదారి తీవ్రంగా దెబ్బతిని వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారింది. రోడ్డు కుడివైపు భాగం పూర్తిగా కుంగిపోవడంతో కింద ఉన్న సిమెంట్ దిమ్మ (స్లాబ్) విరిగిపోయి, దాని దిగువన ఉన్న కాలువ బయటపడింది. దీంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ వందలాది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారి దెబ్బతిన్న విషయం గమనించలేక పలువురు వాహనదారులు కింద ఉన్న కాలువలో పడిపోయి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తుగా చర్యలు తీసుకుని రహదారిని బాగు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం దెబ్బతిన్న ప్రాంతానికి ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రక్షణ బారికేడ్లు లేదా ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాద ముప్పు మరింత పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారిని పునరుద్ధరించడంతో పాటు, కాలువపై బలమైన సిమెంట్ స్లాబ్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఎప్పుడైనా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# జాబితాపూర్‌లో ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు

- శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 5.**

జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో ఆదివారం శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షుడు మద్దికుంట హరీష్, సంఘం ఉపాధ్యక్షుడు మొగిలిపల్లి చంద్రయ్య, గ్రామ సర్పంచ్ పొంశెట్టి మహేష్, ఉపసర్పంచ్ మర్చుటి లక్ష్మణ్, వార్డు సభ్యుడు శెట్టి రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామానికి చెందిన యువతీ, యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# పార్కింగ్ చేసిన బైక్ చోరీ

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 05 ప్రజాతీర్పు**



ఇంటి ముందే పార్కింగ్ చేసిన బైక్ చోరీ అయిన ఘటన హుస్నాబాద్ పట్టణం లో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని నాగారం రోడ్డులో వెంకటేశ్వర కళామందిర్ కు సమీపంలో నివసిస్తున్న మాంకాళి రాజయ్య ప్రతిరోజు పార్కింగ్ చేసినట్టుగానే తన యొక్క ద్విచక్ర వాహనం టిఎ 36 4934 (హోండా షైన్) ను శనివారం రాత్రి ఇంటిముందు పార్కింగ్ చేసి ఉంచాడు. తెల్లారి లేచి చూసేసరికి పార్కింగ్ చేసిన స్థలంలో బైక్ లేకపోవడంతో కంగారు పడ్డాడు. చివరికి చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బైక్ పార్క్ చేసిన ప్రదేశంలో చుట్టుప్రక్కల దుకాణాల వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



# బవర్ యూజీ సమ్మిట్ 2.0లో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 5**

హైదరాబాద్ లోని టీ–హబ్‌లో నిర్వహించిన బవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలోని బవర్ యూజీ సమ్మిట్ 2.0" కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, పాల్గొన్నారు. నేడు నాకు 18 సంవత్సరాల వయస్సు ఉంటే?" అనే భావనతో నిర్వహించిన ఈ సదస్సులో ఎంపీ ముఖ్య వక్తగా హాజరై,భారత యువత భవిష్యత్తు నిర్మాణం, నాయకత్వం మరియు పారిశ్రామిక అవకాశాలు అనే అంశంపై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ, మాట్లాడుతూ, నేటి యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఉద్యోగాలను కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగడం ద్వారా ప్రపంచ స్థాయిలో భారత యువత సత్తా చాటగలరని పేర్కొన్నారు.యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించే దిశగా ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగకరమని ఎంపీ గారు అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువత చేతుల్లోనే ఉందని, ప్రతి విద్యార్థి తన కలలను లక్ష్యాలుగా మార్చుకుని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, యువ పారిశ్రామిక వేత్తలు, అధ్యాపకులు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యా రంగ నిపుణులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు ఎంపీ శ్రీ గడ్డం వంశీకృష్ణ,ని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆవిరితో కరుగుతున్న నిజాంసాగర్ జలాలు...

**నిజాంసాగర్ / జూలై 05 ( ప్రజా తీర్పు )**

నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గుతూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది.ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.622 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.రోజుకు సుమారు 135 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం ప్రాజెక్టులోకి గణనీయమైన స్థాయిలో వరదనీరు చేరకపోవడంతో నిల్వలు రోజురోజుకు తగ్గుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.తాగునీటి అవసరాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.అవసరమైన మేరకే నీటిని విడుదల చేస్తూ, వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులోకి కొత్తగా నీటి ప్రవాహం చేరితేనే నిల్వలు మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.దీంతో రైతులు, ప్రజలు కూడా మంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

# అశ్వారావుపేట మండల ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

- మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి
- వర్షాకాలంతో సీజనల్ వ్యాధుల ముప్పు
- దోమల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించాలని డిమాండ్

**అశ్వారావుపేట, జూలై 5,(ప్రజా తీర్పు )**



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అశ్వారావుపేట మండల వ్యాప్తంగా దోమల బెడద తీవ్రంగా పెరిగిందని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ఒక ప్రకటన ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. దోమల వ్యాప్తి కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు, వనరులు ముందుగానే అందుబాటులో ఉంచి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ (ప్రత్యేక యంత్రం ద్వారా దోమలను నిర్మూలించే మందు పొగను పిచికారీ చేసే ప్రక్రియ) వంటి పారిశుధ్య చర్యలను క్రమం తప్పకుండా చేపట్టేవారని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పందించాలని శ్రీరామమూర్తి కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్‌ను సరఫరా చేసి గ్రామాల్లో చల్లడంతో పాటు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంటువ్యాధులు వ్యాపించక ముందే ప్రభుత్వం, సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి మండల ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ప్రభుత్వాన్ని కోరారు.

# మైనర్లు వాహనాలు నడపొద్దు

**హుస్నాబాద్ చిగురు మామిడి జూలై 05 ప్రజాతీర్పు**




మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని మైనర్లకు, తల్లితండ్రులకు మనవి వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులు మైనర్లు కు వాహనాలు ఇవ్వడంతో దీంతో ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా తీవ్రమైన గాయాల పాలు అవుతున్నారని చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలను ఇవ్వద్దని ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. అదేవిధంగా మైనర్లు కు మరియు డ్రైవింగ్ లైసెన్సు లేదని తెలిసి కూడా వాహనం ఇచ్చినట్లయితే వాహనం ఇచ్చిన ఓనర్ పైన కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని, మరియు నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం, తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే శ్రద్ధ కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాలు సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలకు లోబడి లేకపోతే, చీటింగ్ కేసు నమోదు చేస్తామని, కావున మండల ప్రజలు దీనిని దృష్టిలో పెట్టుకొని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలు ఇచ్చి రోడ్డు ప్రమాదాలకు కారకులు కారాదని, మరియు మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతోపాటు జరిమానాలు తప్పవని ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.



# గంగపుత్రులను అభినందించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి

**మంథని, జూలై-05 (ప్రజాతీర్పు)**

ఇటీవల మంథని గోదావరి నదిలో గల్లంతై మృతి చెందిన కొమురయ్య మృతదేహాన్ని తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వెలికితీసి, కుటుంబ సభ్యులకు అప్పగించిన గంగపుత్రుల సేవలను కొనియాడుతూ.. ఆదివారం బెస్తపల్లి గ్రామంలో గంగపుత్రులను మరియు సర్పంచ్ శ్రీనివాస్ ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో ఏమాత్రం వెనుకాడకుండా మానవత్వంతో ముందుకు వచ్చి సేవలందించిన గంగపుత్రులు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. వారి సేవా భావం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మంథని మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, కొండ్రు లక్ష్మణ్, వార్డు సభ్యుడు కంచు మల్లేష్, తోట్ల రాజు, బొరె తిరుపతి, బొరె రాజేశం, ధర్మాజీ రాజేందర్, మహేష్, సందీప్, గుమ్మడి హేమంత్ పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు 50 లక్షల ప్రమాద బీమా

## రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి మరియు బ్యాంకు యాజమాన్యాలను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 05**




స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంకు మాదిరిగానే సింగరేణి వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ లలో , ఇతర బ్యాంకు లలో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కు కూడా 50 లక్షల నుండి 30 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా తెలంగాణ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గౌరవ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి గారిని , ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారిని, రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి గారిని , పెద్దపల్లి ఎంపీ గౌరవ గడ్డం వంశీ కృష్ణ గారిని మరియు సింగరేణి జవీణ డైరెక్టర్ పా గార్లను ఈరోజున జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం విజ్ఞతి చేసినారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారుల మాదిరిగానే యూనియన్ బ్యాంకు ఇతర బ్యాంకులలో వేలాడు మంది సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఖాతాలు కలిగి ఉన్నారని వారికి కూడా 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్టయితే వారి కుటుంబాలను కూడా ఆదుకున్న వారైతారని కొండంత ఆసరా కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని , సింగరేణి జవీణ ని మరియు యూనియన్ బ్యాంకు, ఇతర బ్యాంకు ల యాజమాన్యాలకు ఈ సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశం లో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు ఏ గంగయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్ళబండి రాజన్న, కార్యదర్శి పోతరాజుల చంద్రయ్య , నాయకులు మునిశెట్టి ధర్మారావు , ఎం రాంబాబు , ఎల్ లచ్చన్న , ఏ రామన్న , చల్లా రాజిరెడ్డి , ఎల్ శంకర్ రావు , పి నారాయణ , గూడ శంకర్ , శేషాంక్ రావు , జి బక్కయ్య , ఎం రాజేశ్వర్ రావు , ఎస్ భూమన్న తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టండి

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 05 ప్రజా తీర్పు**

ప్రమాదాలు జరిగే పందిల్ల బ్రిడ్జి వద్ద నివారణ చర్యలు చేపట్టండి అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పందిళ్ళ బ్రిడ్జి పై జరుగుతున్న ప్రమాదాల దృశ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బ్రిడ్జికి రెండు వైపులా ఎలాంటి రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. బ్రిడ్జి వద్ద ఉన్న రైతులు నిత్యం పొలాల వద్దకు వచ్చి వెళుతుంటారని, గతంలోనే నలుగురు చనిపోయి మరి కొంతమంది ఈ బ్రిడ్జి వద్ద తీవ్రంగా గాయపడ్డ సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరుగుతున్నా కూడా అధికారులు కానీ, ప్రభుత్వం గానీ బాధ్యత తీసుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని, లేనిచో ప్రజల పక్షాన పోరాడడానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్, ఎల్లా గౌడ్, జానకిరామ్, నెమలికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# రామడుగులో గ్రామపంచాయతీకి వైకుంఠరథం అందజేత

## ఎన్నారై తోట సత్యం సేవలు అభినందనీయం

**రామడుగు, జూలై 5 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఆదివారం తోట బుచ్చమ్మ వెంకటయ్య దంపతుల జ్ఞాపకార్థం వైకుంఠ రథాన్ని గ్రామపంచాయతీకి అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్నారై, సామాజిక సేవకుడు తోట సత్యం తన చేతుల మీదుగా వైకుంఠ రథాన్ని ప్రారంభించి గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా తోట సత్యం మాట్లాడుతూ, తాను పుట్టి పెరిగిన రామడుగు గ్రామానికి సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, జీవితాంతం పేద ప్రజల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. గత ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వృద్ధులకు పెన్షన్లు, నిరుపేదలకు ఆర్థిక సహాయం, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక తోడ్పాటు, తన సొంత నిధులతో డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్సుల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన వైకుంఠ రథాన్ని అందించడం ఎంతో గొప్ప సేవ అని గ్రామస్తులు కొనియాడారు. సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ తోట సత్యం చేస్తున్న సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిజ్, ఉప సర్పంచ్ రాజు, నాగి శేఖర్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, చందా అనిల్, జెట్టిపెల్లి అశోక్, కర్ణ శ్రీనివాస్, సిరిగిరి వెంకటేష్, రామడుగు అశోక్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నగునూరు దుర్గాభవానీ ఆలయంలో 14 నుండి శాకాంబరీ ఉత్సవాలు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ జూలై 05 )**



కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఈనెల 14 నుండి 29 వరకు శాకాంభరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్ తెలిపారు. 14న అమావాస్య సందర్భంగా ఆలయంలోని దుర్గాభవానీ అమ్మ వారికి ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు, ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతాయని ఆయన పెర్కోన్నారు. ఈ ఉత్సవాల్లో రోజుకొక కూరగాయాల మాలతో అమ్మవారిని అలంకరిస్తారని ఆయన వివరించారు. 23న చండీహోమం, మహాపూర్ణహుతి, శాకాంభరీ చివరి రోజైన 29న అన్ని రకాల కూరగాయల మాలల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు. అదే రోజు పౌర్ణమి సందర్భంగా వ్యాసపూజ, సాయంత్రం 7 గంటలకు పల్లకిసేవ, సహస్రదీపాలంకరణ, ఉయ్యాల సేవ, విశేష పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి విశేష మంగళ హారతి, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈ ఉత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# రహదారులు పదిలమేనా అంటే

## అవునని చెప్పలేం కాదని చెప్పలేం అన్నట్టుగా ఉన్నది

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)జూలై 5**



ఇల్లంతకుంట నుండి కరీంనగర్ వైపు సాగే కట్కూరు పొత్తురు మధ్యలో రహదారులపై గుంతలు మరియూ ప్రధానమైనటువంటి పొత్తురు బ్రిడ్జ్ పై ప్రమాదకంగా లింకు ల దగ్గర సిమెంట్ పూర్తిగా ధ్వంసం కావస్తున్నది కావున ప్రయాణికులకు ప్రమాదకరం గా మారింది చీకటిపడితే వీది దీపాలు వెలగలేక పోవడం కొన్ని లైట్ స్థంబాలు ప్రక్కకు ఒరిగిపోవడం బ్రిడ్జ్ నిర్వహన లోపం స్పష్టంగా కనిపిస్తుంది ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సరైన చర్యలు తీసుకొని బ్రిడ్జ్ పై సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# రేకుల షెడ్డు కూల్చివేత: ముగ్గురిపై కేసు నమోదు




**బీర్‌పూర్, జూలై 5 (ప్రజా తీర్పు):**

రేకుల షెడ్డును అక్రమంగా కూల్చివేసిన ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బీర్ పూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సింహులపల్లి గ్రామానికి చెందిన భోగ సత్తన్న తండ్రి కిష్టయ్య కు చెందిన రేకుల షెడ్డును, 05, జూలై, సోమవారం ధ్యావనపల్లి గంగాధర్ మరియు అతని ఇద్దరు కొడుకులైన ధ్యావనపల్లి గణేష్, రాజేందర్ కలిసి వారి ట్రాక్టర్ దోజర్‌తో కూల్చివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

# శ్రీ పోచమ్మ తల్లి వార్షికోత్సవ మహోత్సవాలలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు

**(వినోద్, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా) జూలై 05**



మేడ్చల్ జిల్లా,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 293వ సాయిబాబా నగర్ డివిజన్‌లోని అపురూప కాలనీలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి వార్షికోత్సవ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ముఖ్య అతిథిగా ఆదివారం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ, గ్రామ దేవతగా కోట్లాది మంది భక్తుల ఆరాధనలను అందుకుంటున్న శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అలాగే, సామాజిక ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దేవాలయ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని, సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, అపురూప కాలనీ అధ్యక్షుడు తిప్పారెడ్డి, సీతారాం రెడ్డి, రామకృష్ణ, మోహన్, వేణు రెడ్డి, కంచ కృష్ణమోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కురవి వీరభద్ర ఆలయ సాక్షిగా మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎటు పోతుంది...

- మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కి సేవ చేసే వారికి పదవులు కరువు
- మదన పడుతున్న కురవి మండల కాంగ్రెస్ నేత అవిరె మోహన్ రావు
- ఇంట్లో గెలవనోడు రచ్చ గెలిసినట్టు..!

కురవి మండలంలో ప్రజలు గుసగుసలు...

**కురవి జులై 05 (ప్రజా తీర్పు విలేఖరి):**



మండలానికి ఇటీవల సుమారు ఒక కోటి ఎనభై లక్షల రూపాయలు ఎన్ ఆర్ ఇ జి ఎస్ నిధులు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు,ముఖ్యంగా సి సి రోడ్ల నిర్మాణం కోసం విడుదలయ్యాయి.అయితే ఈ నిధులు నిజంగా గ్రామాభివృద్ధికే వినియోగం అవుతున్నాయా? లేక కొందరి స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మారుతున్నాయా? అనే అనుమానాలు మండల,గ్రామ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి.మండలంలో అభివృద్ధి పనుల కేటాయింపులో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ జాటోతు.రామచంద్రు నాయక్ సూచనలు జిల్లా మరియు మండల స్థాయి నాయకుల అభిప్రాయాలను పక్కన పెట్టి మాజీ కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్ ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ముఖ్యంగా కమిషన్లు ఇచ్చే వారికే ఎన్ఆర్ఈజీఎస్ ఇతర అభివృద్ధి పనులు కేటాయిస్తున్నారనే ఆరోపణలు కార్యకర్తల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.ఇటువంటి పరిస్థితులు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా,కార్యకర్తల్లో నిరుత్సాహాన్ని పెంచుతున్నాయని పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.ఈ ఏకపక్ష ధోరణి,సమన్వయ లోపం కారణంగా మండలంలోని పలువురు సీనియర్ నాయకులు,కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలకు ఇటీవల దూరమవుతున్నారని చెబుతున్నారు.అలాగే కొన్ని నెలల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 18 గ్రామాల్లో ఓటమి చెందడం కూడా పార్టీ ఆత్మ పరిశీలన చేయాల్సిన అంశంగా మారింది.మండల కేంద్రం కురవి గ్రామ పంచాయతీలో పార్టీ ఓటమి చెందడం,అలాగే మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్ తమ స్వగ్రామమైన నల్లెల్ల లో తమకు ఓటు ఉన్న వార్డులో కూడా కనీసం ఒక్క వార్డు సభ్యుడిని గెలిపించుకోలేకపోవడం ఆయన నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని కాంగ్రెస్ కార్యకర్తలు, మరియు ఇతర నాయకులు పేర్కొంటున్నారు.ఈ పరిస్థితులపై మండలంలోని పలువురు నాయకులు,కార్యకర్తలు పార్టీ అధిష్టానం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఆశించిన స్పందన రాలేదని,ఫలితంగా కొంతమంది సీనియర్ నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం.అలాగే కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని (ఖమ్మం నుంచి కురవి) ప్యారాచూట్ వ్యక్తులకు,కాంగ్రెస్ పార్టీలో కనీస సభ్యత్వం లేక స్థానిక బలం లేని వారికి కురవి మండల అధ్యక్ష పదవిని అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా కార్యకర్తల్లో తీవ్ర ఆందోళన కలుగుతుంది.ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందో పార్టీ అధిష్టానం స్పష్టత ఇవ్వాలని కార్యకర్తలు కోరుతున్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే పారదర్శకత,సమన్వయం,కార్యకర్తలకు గౌరవం,నిజాయితీతో కూడిన నాయకత్వం అత్యవసరం.మండల నాయకులు,కార్యకర్తల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్టానం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కార్యకర్తలు, మరియు కాంగ్రెస్ అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బీజేపీ కంచుకోట నుంచి ఎన్నికల బరిలోకి పీకే.. బాంకీపూర్ ఉపఎన్నికలో పోటీ



ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. బీహార్‌లో బీజేపీ కంచుకోట బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి తెలిపారు. బీహార్ బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నికై, తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో బాంకీపూర్ స్థానం ఖాళీ అయ్యింది. సమ్రాట్ చౌదరి ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నిక ఒక ప్రజాభిప్రాయ సేకరణలాంటిదని పీకే అన్నారు.



# బీర్ పూర్ గ్రామంలో దొంగతనం.. వృద్ధుడి ఇంట్లో బంగారం, వెండి మాయం!

**బీర్‌పూర్, జూలై 5 (ప్రజా తీర్పు):**

బీర్ పూర్ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన దుండగులు పెద్ద మొత్తంలో బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన మధిరె గంగయ్య (84, తండ్రి: ఎల్లయ్య) తన భార్య రాజనర్సుతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో, జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జరుగుతున్న తమ కుమార్తె గృహప్రవేశ వేడుకకు వెళ్లడం కోసం ఇంటికి తాళం వేసి భార్యాభర్తలిద్దరూ బయలుదేరారు. 5 జూలై ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వారు తిరిగి ఇంటికి వచ్చేసరికి, ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా, మట్టి కుండలో ఒక గుడ్డలో మూటకట్టి దాచిన 4.75 తులాల బంగారం మరియు 65 తులాల వెండి ఆభరణాలను గుర్తుతెలియని దొంగలు అపహరించినట్లు గుర్తించారు. బాధితుడు మధిరె గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీర్ పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్.ఐ. ఎస్. రాజు తెలిపారు. ఈ దొంగతనం విషయం తెలిసిన వెంటనే రూరల్ సీఐ మధుకర్ మరియు బీర్ పూర్ ఎస్.ఐ. ఎస్. రాజు కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి, పరిశీలించారు.



# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పటేల్ రమేష్ రెడ్డి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 5**

ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య చికిత్స కోసం ఈ సాయాన్ని మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ పటేల్ రమేష్ రెడ్డి గారు మాట్లాడుతూ, “ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం మా బాధ్యత. ప్రతి అవసరమైన కుటుంబానికి సకాలంలో సాయం అందేలా నిరంతరం కృషి చేస్తాను” అని తెలిపారు. అలాగే, గత 28 నెలల కాలంలో ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గంలోని 208 మంది లబ్దిదారులకు రూ. 98,81,750/- విలువైన ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైందని పేర్కొన్నారు. ఇది ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కలిగిన నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు... ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణ రెడ్డి గారు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గారు కాంగ్రెస్ పార్టీ పతన అధ్యక్షులు వెలుగు వెంకన్న గారు, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల రమేష్ నాయుడు గారు, జ్యోతి కరుణాకర్ గారు,మేగ్య తండా సర్పంచ్ రాజు నాయక్ గారు, , కాంగ్రెస్ పార్టీ నాయకులు వాల్దాస్ దేవేందర్ గారు, తండు శ్రీనివాస్ గారు, ముదిరెడ్డి ఎల్లరెడ్డి గారు, యాట ఉపేందర్ గారు,మర్ల కరుణాకర్ రెడ్డి గారు, కంచర్ల వేణు రెడ్డి గారు, దండ అర్విండ్ రెడ్డి గారు,, ధరవత్ ధర్మ గారు, తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ టెండర్లను రద్దు చేయాలి

## సిపిఐ నగర కార్యదర్శి రెడ్డి సురేందర్ రెడ్డి

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ జులై 05)**




కార్పొరేటర్ల ఫోన్ కొనుగోళ్ల కోసం టెండర్లు నిర్వహించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, వాటిని వెంటనే టెండర్లను రద్దు చేయాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఐ నగర కార్యదర్శి రెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి పైడిపల్లి రాజు న్యాలపట్ల రాజు మాట్లాడుతూ నగరంలో ప్రజల దగ్గర ఇంటి పన్ను, నల్ల బిల్లు, చివరికి చెత్త తీసుకపోవడానికి కూడా వందల రూపాయలు దోచుకెళ్తున్న అధికారులు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుల సెల్ ఫోన్ల కొనుగోళ్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటు అన్నారు. నగరంలో వీధిదీపాలు, డ్రైనేజీలు వర్షం వస్తే నీటి నిలువ ఉండకుండా చర్యలు తీసుకోలేని చేతగాని దుస్థితిలో ఉన్న మున్సిపల్ అధికారులకు లక్షల రూపాయలు కార్పొరేటర్ల ఫోన్లు కొనడానికి మాత్రం ఏ విధంగా వస్తున్నాయని వారు ప్రశ్నించారు. అధికారులు ప్రజాధనం వృధా చేయకుండా కార్పొరేటర్ల సెల్ ఫోన్ల కోసం కేటాయించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ ఆఫీసును ముట్టడించి ప్రజలకు ఈ అవినీతిని బయటపెడతామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి,పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 5**

సూర్యాపేట పట్టణంలోని హనుమాన్ నగర్ లో 47వ వార్డుకు చెందిన నరేంద్రుని ఉష ఉపేందర్ గార్ల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది గారు ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి గారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు గురైయ్యారని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారు, జిల్లా మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి నాయకత్వంలో సూర్యాపేట నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయించి సొంతింటి కల సహకారం చేస్తున్నారని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో మందికి ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాలోతు చంద్రు నాయక్, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగు నాయక్, పడిదల రవి, మద్దెబోయిన శ్రీనివాస్, నరేందర్ నాయుడు, ఖమ్మంపాటి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.





## ఆర్ఎల్ నగర్‌లో నూతన కాఫీ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

**వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా,జులై 05**

మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం డివిజన్ 5, ఆర్ఎల్ నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన కాఫీ షాప్ను మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు వచ్చి కొత్త వ్యాపారాలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. చిన్న వ్యాపారాలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. వ్యాపార సంస్థ యజమానులు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. నూతనంగా ప్రారంభించిన కాఫీ షాప్ యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, ముప్పు శ్రీనివాస్ రెడ్డి, సత్యం సాగర్, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, నిమ్మల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## 'హెర్ముజ్'లో ఇరాన్ సర్వీస్ ఫీజు.. అండగా నిలిచిన దేశాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన



హెర్ముజ్ జలసంధిలో నౌకలపై సేవా రుసుము వసూలు చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఆ దేశ రాయబారి అబ్దుల్‌రెజా రెహమాన్ ఫాజ్లి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా రాజధాని బీజింగ్‌లో శనివారం జరిగిన ప్రపంచ శాంతి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. యుద్ధ సమయంలో ఇరాన్‌కు అండగా నిలిచిన దేశాలకు మాత్రం సేవా రుసుములో ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు చెప్పారు. ఒమన్‌తో కలిసి ఇరాన్ హెర్ముజ్‌లో నౌకల రవాణాపై ఏర్పాట్లు చేస్తోందన్నారు. 'హెర్ముజ్ మా దేశంలో అంతర్భాగం. కాబట్టి మేం కచ్చితంగా సేవా రుసుము వసూలు చేస్తాం. ఇది టోల్ కాదు. జలసంధి గుండా నౌకలు సులభంగా వెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లకు, ట్రాఫిక్‌ను నియంత్రించినందుకు మేం తీసుకుంటున్న సర్వీస్ ట్యాక్స్' అని అబ్దుల్ వెల్లడించారు. హెర్ముజ్‌లో ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని అమెరికా షరతు పెట్టినా సరే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారాయి. 60 రోజుల పాటు ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని ఇరాన్-యూఎస్ ఒప్పందంలో ఉంది. ఆ తర్వాత ఏమైనా ట్యాక్సులు ఉంటాయా అని ప్రపంచం ఆందోళన చెందుతున్న వేళ.. అబ్దుల్ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.



## విద్యతో పాటు ఉపాధి నైపుణ్య శిక్షణ

**ఓపెన్ వర్సిటీ డైరెక్టర్ వై- వెంకటేశ్వర్లు**

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 5**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు విద్యతోపాటు ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు పొందటానికి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని ఓపెన్ వర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గంట చక్రపాణి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రం లోని ఎస్ వి డిగ్రీ కళాశాల సార్వత్రిక అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ తో అవగాహన ఒప్పందం ప్రకారం విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్స్ జీఎస్టి అసిస్టెంట్ ఎకౌంటు సోలార్ టెక్నీషియన్ సిసి కెమెరాల వంటి విభాగాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. అదేవిధంగా మహిళ విద్యార్థులకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని బీఎస్సీ ఎంపీసీ బీ జెడ్ సి బీకాం కంప్యూటర్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్స్ కేంద్రాన్ని ఈ సంవత్సరం నుండి ఎస్వి కళాశాల సార్వత్రిక అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు . కోయ ,చెంచు ఆదివాసి గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని అన్నారు .పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా అనుభవజ్ఞులైన సీనియర్ ప్రొఫెసర్ల చే స్టడీ మెటీరియల్ తయారు చేసి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు . ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్ పొందడానికి ఆగస్టు 7 చివరి తేదీ అని ఇతర వివరాల కోసం బిఆర్ఏఓయు ఆన్లైన్ డాట్ ఇన్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాల కోసం ఎస్వీ కళాశాల స్టడీ సెంటర్ ను సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి వెంకటేషులు మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షల నిమిత్తం నల్లగొండ పట్టణానికి వెళ్ళుటకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కళాశాల సార్వత్రిక కేంద్రంలో ప్రాక్టికల్స్ సెంటర్ ను ఏర్పాటు చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కిషోర్ రెడ్డి ,డాక్టర్ అనిల్, మల్లయ్య, సార్వత్రిక అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి, క్లర్క్ ప్రసాద్ కౌన్సిలర్లు బుక్క ఉపేందర్ వడ్డానం శ్రీనివాస్ మధు సుఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాప్ ఈ-20.. ఇథనాల్ పెట్రోల్‌పై ఢిల్లీలో తీవ్ర నిరసనలు

ఈ-20 పెట్రోల్ మీద దేశ వ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతోంది. మొట్టమొదటిసారి ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కార్లు, బైకుల వాహనదారులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 'హమారా గాడీ-హమారా అధికార్' నినాదంతో వ్యాపారవేత్త, టీవీ వ్యాఖ్యాత తహ్‌సీన్ పూనావాలా, ఆయన ప్రచార కార్యక్రమం టీమ్ భారత్ ఆధ్వర్యంలో ఈ నిరసనలు జరిగాయి. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించిన ఈ-20 పెట్రోల్ వల్ల తమ వాహనాల మైలేజీ తగ్గుతోందని, రిపేర్ల ఖర్చులు పెరుగుతున్నాయని నిరసనకారులు తెలిపారు. ఇది ఏ పార్టీకి చెందిన నిరసన కాదని.. నిరసన కారుల్లో బీజేపీ మద్దతుదారులే ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇథనాల్ పెట్రోల్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ-20 పెట్రోల్‌నే తమ వాహనాలు తట్టుకోవట్లేదని..ఇక ఈ-85 తీసుకొస్తే ఎలా అని మండిపడ్డారు.

## ఏరియా ఆసుపత్రి, యూపీహెచ్‌సీలు అభివృద్ధి, వైద్యుల నియామకంపై చర్యలు కోరిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా) జులై 05**



మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆరోగ్య సేవలను మరింత విస్తరించి ప్రజలకు నాణ్యమైన వైద్య సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, ఐఏఎస్లను మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రం ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న మల్కాజిగిరి నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంలో ప్రధానంగా మౌలాలి ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ యూనానీ ఆసుపత్రి ఆవరణలో ప్రతిపాదిత అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ యూపీహెచ్‌సీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ఏకలవ్య నగర్‌లో కేటాయించిన స్థలంలో యూపీహెచ్‌సీ నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అదేవిధంగా మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రిలో టీఎంఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, సీటీ స్కాన్ యంత్రం ఏర్పాటు, హై వోల్టేజ్ విద్యుత్ సౌకర్యాల కల్పన వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని, అలాగే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రెండో ఔట్ పేషెంట్ సెకండ్ ఓపీ సేవలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు ఆధునిక, నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజారోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.



## సోషల్ జస్టిస్ పార్టీ నిర్వహించే దివ్యాంగుల వేదన దీక్షకు మద్దతుగా పోస్టర్ ఆవిష్కరించిన దివ్యాంగుల విశ్వవిద్యాలయాల జేఏసీ

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై 5**

దివ్యాంగుల హక్కులకై వారి యొక్క ఆత్మ గౌరవానికి చామకూర రాజు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు సోమవారం నిర్వచించబోయే వేదన దీక్ష కొత్తపేటలో హుడా కాంప్లెక్స్ వద్ద నిర్వహించబోయే దివ్యాంగుల వేదన దీక్షకు మద్దతు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలని ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేధావులు సామాజిక నాయకులు అదేవిధంగా ప్రజానీకం దివ్యాంగులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ మాట్లాడారు రాజ్యాధికారం ఫోరం అధ్యక్షుడు వంశీ రాజ్ రామచంద్ర. దివ్యాంగుల మహిళా సాధికారిక అధ్యక్షురాలు కె రాజ్యలక్ష్మి, దివ్యాంగుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస రావు, మారవేణి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పల్స ఆంజనేయులు గౌడ్, సహాయ కార్యదర్శి, మోదాల సైదులు యాదవ్, కస్తూరి వేణుగోపాల్ రెడ్డి, దివ్యాంగుల ఫోరం మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు దానమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు. దీక్ష విజయవంతం చేయాలని, దివ్యాంగుల భవిష్యత్తు ఈ దీక్ష మారుస్తుందని అందుకోసం అందరం కలిసికట్టుగా దివ్యాంగుల హక్కులను కాపాడుకోవడానికి దీక్షకు మద్దతుగా కదిలి రావాలని కోరడం జరిగింది.

## రోజూ రూ.6-8 లక్షలు చోరీ

**అయోధ్య కేసులో సిట్ అంచనా**



అయోధ్య: అయోధ్య రామాలయంలో ప్రతి రోజూ రూ.6-8 లక్షల విరాళాలు పక్క దారి పట్టి ఉంటాయని సిట్ అంచనా వేసింది. ఎన్డీటీవీ కథనం ప్రకారం విరాళాల చోరీ విషయం వెలుగులోకి రాక ముందు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బ్యాంక్ ఖాతాలకు రోజుకు రూ.16-18 లక్షల విరాళాలు వచ్చేవి. కేసు నమోదయ్యాక ఆ ఖాతాలకు రోజుకు రూ.24-26 లక్షల విరాళాలు వచ్చాయని సిట్‌కు బ్యాంకు అధికారులు వెల్లడించారు. నగదు విరాళాలను ఎస్బీఐ ఒక ప్రైవేట్ ఏజెన్సీతో కలిసి పర్యవేక్షిస్తుంది. విరాళాల లెక్కింపు ప్రక్రియను రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సుభాష్ శ్రీవాస్తవ పర్యవేక్షిస్తారు. విరాళాల గల్లంతు గురించి ఒక సహోద్యోగి ఆయనకు తెలిపినప్పుడు.. 'దేవుడు చూస్తూనే ఉన్నాడు..ఇది నీ ఇంట్లో నుంచో లేదా నా ఇంట్లో నుంచో పోయేదేమీ కాదు కదా' అని వ్యాఖ్యానించాడు. ఆలయ ట్రస్ట్‌తో కుదిరిన ఒప్పందంలోని వ్యత్యాసాలు, విధానపరమైన మార్పుల గురించి కూడా సిట్ బ్యాంక్ అధికారులను ప్రశ్నించింది. అనుమానిత అవకతవకలను ఉన్నతాధికారులకు ఎందుకు నివేదించలేదని వారిని అడిగింది. నగదు లెక్కింపులో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ పాత్రపైనా ప్రశ్నలు లెవనెత్తింది. ట్రస్ట్ వార్షిక ఆడిట్ నివేదికలు, ఆర్థిక రికార్డులు, ఇతర కీలక పత్రాలను తమకు అందించాలని సిట్ కోరింది. దర్యాప్తులో భాగంగా వాటిని తిరిగి ఆడిటింగ్ చేయడాన్ని సిట్ పరిశీలిస్తున్నది.

**5 కోట్ల బంగారు రామచరిత మానస్ మాయం!**

తన కుటుంబం విరాళంగా ఇచ్చిన రూ.5 కోట్ల విలువైన బంగారు పలకల రామచరిత మానస్‌ను అయోధ్య రామాలయం నుంచి బయటకు తరలించారని మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ లక్ష్మీనారాయణన్ ఆరోపించారు. 2024 ఏప్రిల్‌లో తాము ఆలయ ట్రస్ట్‌కు ఈ కానుకను అందించామన్నారు. అయితే ఆ తర్వాత ఆలయ ప్రాంగణం నుంచి దాన్ని తరలించారని ఆయన తెలిపారు. ఆలయానికి ఇచ్చిన ప్రతి కానుకను మందిరంలోనే ప్రదర్శించలేమని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తనకు చెప్పారని ఆయన వెల్లడించారు. ఆలయానికి విరాళంగా ఇచ్చిన వెండి కడ్డీలు, ఇటుకలు పెద్ద సంఖ్యలో కనిపించడం లేదని కొన్ని రోజుల క్రితం విపక్షాలు, భారత బులియన్, నగల వర్తకుల సంఘం ఆరోపించింది.

# స్వాతంత్ర్యం మా హక్కు.. తీవ్రమవుతున్న ఆందోళనలు

## పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పీవోకేలో పెద్ద ఎత్తున నిరసన

**స్వాతంత్ర్యం మా హక్కు.. తీవ్రమవుతున్న ఆందోళనలు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న పౌర తిరుగుబాటు 27వ రోజుకు చేరుకున్నది. తీవ్రమవుతున్న ప్రభుత్వ అణచివేత, సాయుధ పారామిలిటరీ చర్యలు, కాల్పుల వ్యూహాలను ధిక్కరిస్తూ, పాకిస్థాన్ పాలన నుంచి విముక్తి కోరుతూ నిరసనకారులు ఆందోళన తీవ్రం చేస్తున్నారు.**



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న పౌర తిరుగుబాటు 27వ రోజుకు చేరుకున్నది. తీవ్రమవుతున్న ప్రభుత్వ అణచివేత, సాయుధ పారామిలిటరీ చర్యలు, కాల్పుల వ్యూహాలను ధిక్కరిస్తూ, పాకిస్థాన్ పాలన నుంచి విముక్తి కోరుతూ నిరసనకారులు ఆందోళన తీవ్రం చేస్తున్నారు. అదే సమయంలో మానవతా సహాయం, ఆహార సరఫరా కోసం భారతదేశంతో పునరేకీకరణ వైపు మొగ్గు చూపుతున్నట్టు సంకేతాలు ఇచ్చారు. ఈ భారీ ప్రదర్శనల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. కోట్లి ప్రాంతంలో పాకిస్థాన్ ఆక్రమణను పూర్తిగా తిరస్కరిస్తూ వేలాది మంది ప్రజలు ఒకచోట చేరి నినాదాలు చేశారు. "స్వాతంత్ర్యం మా హక్కు, మేము మా స్వాతంత్ర్యాన్ని సాధించుకుంటాం" అని భారీ జనసందోహం నినదించడం కనిపించింది. పాక్ ప్రభుత్వ యంత్రాంగానికి వ్యతిరేకంగా స్థానిక బృందాలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. రావల్‌కోట్, హట్టియన్ బాలాలో పాలకులు, భద్రతా సంస్థలను నేరుగా హెచ్చరిస్తూ వీధులు మార్మోగాయి.

**నిరసనకారులపై కాల్పులు**

ఉద్యమాన్ని హింసాత్మకంగా అణచివేయడానికి పాక్ ప్రయత్నిస్తున్నది. ముజఫరాబాద్‌లోని వ్యూహాత్మక నీలం బ్రిడ్జ్ వద్ద, దాద్యాల్‌లో పాకిస్థానీ రేంజర్స్ నిరసనకారులపై కాల్పులు జరిగాయి. ఇందులో కనీసం 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల తర్వాత సైతం నిరసనకారులు భారీ మోటర్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తూ, సాయుధ పోలీసు విభాగాలను ఎదుర్కొంటూ వీధుల్లో తమ పట్టును కొనసాగిస్తున్నారు.

# రాజకీయ జోక్యం తో సింగరేణి అతలా కుతలం

- 10 ఏళ్ళగా అభివృద్ధి నుంచి ఆర్థిక సంక్షోభం దిశగా



వ్యాస కర్త :ఏబూసి
సెల్,9849157969

సింగరేణి తెలంగాణ రాష్ట్రం లో ఉన్న భారీ ప్రభుత్వ రంగ సంస్థ గా వెలుగొందు తూ గత 28 ఏళ్ళు గా సంస్థ చెపట్టిన పలు మార్పులు సంస్కరణ ల తో లాభాల బాట లో పయనిస్తున్నది. సింగరేణి లో సంస్థగత నిర్ణయాలు, అడ్మినిస్ట్రేషన్ అంతా సంస్థ లోని పాలన యంత్రాంగం పై బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ నుంచి ఏరియా జి. ఎం లవరకు అలాగే పర్సనల్ అధికారుల నుంచి వెల్ఫేర్ ఆఫీసర్ ల వరకు పైన యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు అమలు చేసే నిర్దిష్ట మైన వ్యవస్థ గా కొన సాగుతూ వస్తున్న ది. అలా యాజమాన్యం అనుసరించిన కొన్ని కఠిన మైన నిర్ణయాలు కూడ సింగరేణి ని మరింత ఉన్నతి కి చేర్చుతూ వస్తున్నది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సింగరేణి లో క్రమంగా పెరిగిన రాజకీయ జోక్యం, సింగరేణి సంస్థ మేము చెప్పినట్లు నడుచుకోవాలనే ధోరణి సంస్థ కు ఇబ్బంది కరంగా మారడమేకాక, సింగరేణికంపెనీ అబాసు పాలవుతు విచ్చిన్నం గా దిశకు చేరుకుంటున్నది. రాజ కీయ జోక్యం కొత్త గా వచ్చింది కాదు గత 10 ఏళ్ల కాలం లో బి ఆర్ ఎస్ తో మొదలై అలాగే కొన సాగుతున్నది. ఇటీవల కొల్ బెల్ట్ ఏరియా లో మీటింగ్ లు పెడుతున్న బి ఆర్ ఎస్ నేత హరీష్ రావు మాట్లాడుతూ సింగరేణి లో రాజకీయ జోక్యం పెరిగిందని అన్నారు. ఈ మాట "దయ్యాలు వేదాలు వల్లించి నట్లు " అనే సామెత కు బాగా సరిపోతుంది. 2014-15 తర్వాత రాజకీయ జోక్యం బాగా పెరిగింది. సి. ఎం తో మొదలు కొని మంత్రులు, ఎంపీ లు ఎమ్మెల్యే లు, కోల్ బెల్ట్ లోని స్థానిక నాయకులు సింగరేణి లో పైరవీలు నడపట మే గాక సంస్థ అడ్మిని స్ట్రేషన్ వ్యవహారల లో జోక్యం కూడ చేసుకోవటం వలన కంపెనీ తో పాటు అధికారులు కూడ పలు మార్లు ఇబ్బందుల పాలయ్యే సందర్భాలు ఏర్పడ్డాయి. సింగరేణి లో 1998కి ముందు 5జాతీయ కార్మిక సంఘాలతో పాటు క్రాఫ్ట్ సంఘాలు, విప్లవ కార్మిక సంఘాలు సాజక్ పని చేసేవి వృత్తి సంఘాలు ఏర్పాటు తో 78 కి పైగా సంఘాల తో సింగరేణి లో అధికారుల ను సంప్రదించే వాళ్ళు.నిత్యం ఏదో ఒక సమస్య పై సమ్మె లు జరుగుతూ పారిశ్రామిక అశాంతి నెలకొంటున్నదన్న ఉద్దేశ్యం తో యాజమాన్యం సింగరేణి లో ఒకే సంస్థ -ఒకే యూనియ న్ అనే ఆలోచన తో తొలిసారి 1998 లోగుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు నిర్వహించింది.

గెలిచిన సంఘం తో నె సంప్రదింపులు ఉండాలని సింగరేణి వ్యాప్తంగా రికాగ్నేషన్ పొందిన సంఘం తోనే చర్చలు, మీటింగులు అగ్రిమెంట్లు చేసుకోవాలనే నియమ నిబంధనల (కోడ్ ఆఫ్ డిసిప్లేన్ )ను రూపొందించు కొని, దానికి అన్ని సంఘాల ఆమోదం ను పొంది దానినే అమలు చేస్తూ వచ్చింది. ఎన్నికల్లో తొలి రెండు దఫాలు ఏఐటీయూసీ, గెలువగా 3వ సారి ఐ ఎన్ టి యు సి గర్తింపు సంఘం గా నెగ్గ గా 4వ సారి 2007లో తిరిగి ఏఐటీయూసీ గెలిచింది. 2012 నుంచి బి ఆర్ ఎస్ అనుబంధ టి బి జి కే ఎస్ గుర్తింపు సంఘం గా వరుస గా రెండు సార్లు గెలుపొంది 2023 వరకు కోన సాగింది. 2014లో బి ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చింది.సింగరేణి లో టి బి జి కే ఎస్ గుర్తింపు సంఘం గా గెలవడం తో యూనియన్ అంతర్గత కలహాల తో తరుచుగా బి ఆర్ ఎస్ నాయకుల దగ్గరకు కిరికిరి పరిష్కారం కోసం పోవడంతో సింగరేణి లో ఆ పార్టీ నాయకుల జోక్యం పెరిగింది. ఒక ఎమ్మెల్యే, భూపాలపల్లి బి ఆర్ ఎస్ నేత ఏకంగా మొదటి స్ట్రక్చర్ మీటింగ్ లోనే పాల్గొన్నారు. రెండు గ్రూపు లు గా యూనియన్ నాయకత్వం ఉండడం తో గెలిచిన సంఘం నాయకుల తో ఒక దశలో సంప్రదింపులు, చర్చలు జరుప రాదని ప్రభుత్వ పెద్దలే మేనేజ్ మెంట్ కు ఆదేశాలిచ్చారు. ఇక ఆయా ఏరియా ఎమ్మెల్యే లు, మంత్రుల పైర వీల జోరు నడిపిస్తూ సింగరేణి లో బి ఆర్ ఎస్ నాయకుల జోక్యం జోరందు కున్నది. అంతే కాకుండ సింగరేణి లో ఏరియాల వారీగా నడిచే ప్రధాన కార్యక్రమాలకు బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే లనే గెస్ట్ లు గా పిలవాలనే కొత్త నిబందనలు కూడ వారే మొదలు పెట్టించారు. గుర్తింపు కార్మిక నాయకుల తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను అతిథులుగా కార్యక్రమాలకు పిలవాలనేది బి ఆర్ ఎస్ కండిషన్ పెట్టడం తో కార్మిక నేతల కు యాజమాన్యం దగ్గర ప్రాధాన్యత తగ్గింది. కోలబెల్ట్ ఏరియాకు కాకుండా రాష్ట్రం లోని ఇతర ప్రాంతాల అభివృద్ధి కి సింగరేణి నిధులను కేటాయించా రనే దాని పై కూడ సంస్థ విమర్శలను బి ఆర్ ఎస్ హయాం లోనే ఎదుర్కొంది. 2015 లో కెసిఆర్ భూపాలపల్లి కి వచ్చి, జెన్ కో లో మీటింగ్ పెట్టి నప్పుడు భూపాలపల్లి నియోజక వర్గం లోని బస్ షెల్టర్ ల నిర్మాణానికి సింగరేణి నిధులు కేటాయించాలని సి అండ్ ఎం డి శ్రీధర్ ను వేదిక పైనే కోరారు . అంతే కాదు భూపాలపల్లి సి గ్రేడ్ మున్సిపల్ కింద ఉన్న గనుల ఏరియా కార్మికులకు



హెచ్. ఆర్. ఎ 10 శాతం ఇవ్వాలని కార్మిక సంఘాలు, ఎప్పటినుంచో కోరుతున్నాయి.అప్పటి స్పీకర్ మధు సూదన చారి చైర్మన్ సుతీర్థ బట్టాచార్య ను నేరుగాఇంటికి పిలిచి 10 శాతం హెచ్ ఆర్ ఎ సర్క్యూలర్ అమలు లో తన సూచన మేరకు ఇస్తున్నట్లు పేరు పెట్టి రిలీస్ చేయడం తో రాజకీయ జోక్యం ఎక్కువైందని అప్పటి ప్రాతినిధ్య సంఘాలు జె సి సి సమావేశం లో అభ్యంతరాలు చెప్పాయి. కంపెనీ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ కు విరుద్దమని అభిప్రాయ పడ్డాయి. టి బి జి కే ఎస్ అంతర్గత కుమ్ములాట ల పరిష్కారం తొలగి పోయేందుకు ,సి ఎం కూతురు యూనియన్ గౌరవ అధ్యక్షురాలు గా ఉంటే అన్ని సత్వర పరిష్కారం జరుగుతాయని కల్వ కుంట్ల కవిత ను గౌరవ అధ్యక్షురాలు గా ఆ యూనియన్ కేంద్ర కమిటీ నేత లు నియమించుకున్నరు.కలహాలు తగ్గక పోగా 2016 మార్చి లో జరగాల్సిన సి అండ్ ఎం డి లెవల్ స్ట్రక్చర్ మీటింగ్ ను ఛైర్మెన్ పై ఒత్తిడి తెచ్చి నిలిపి వేయించింది. ఆ మీటింగ్ ద్వారా కొన్ని డిమాండ్లు కార్మికులకు అమలయ్యేవి.కవిత అధిపత్యం తో యూనియన్ అగ్ర నాయకులకు కూడ అపాయింట్మెంట్ ఇచ్చేది కాదు. ఇప్పుడు సామాజిక న్యాయం మంటూ ప్రచారం చేస్తున్న కవిత టి బి జి కే ఎస్ లో దళిత, బి సి నాయకులను నాయకత్వం నుంచి తీసి వేసి అగ్ర వర్ణ లకు చెందిన నేతల కే పదవులు కట్టబెట్టింది.2018లో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను బి ఆర్ ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలను తలపింప జేసింది. కార్మిక నాయకులను ఎక్కడ మాట్లాడ నీయలేదు. ఎం పి, ఎమ్మెల్యే లను అన్ని డివిజన్ లలో ఇంచార్జ్ లు గా నియమించి కోట్ల రూపాయలు ఖర్చు జేసి ఏరియా లేవల్లో పని చేసే ఇతర యూనియన్ నాయకులను సంత లో గొర్రె లను కొన్నట్లుగా కొని విచ్చలవిడి గా ఖర్చు చేసి ప్రతీ గని పై ఇంటలీ జెన్స్ వ్యవస్థ ను ఏర్పాటు చేసి యూనియన్ ను గెలిపించారు. గెలిచిన సంఘాలు కార్మికుల నుంచి వసూలు చేసుకునే సభ్యత్వాన్ని నిలిపి వేయించారు.

ఉద్యమాల లో ముక్య పాత్ర నిర్వహించి ట్రేడ్ యూనియన్లో తొలి నుంచి పని చేస్తున్న నాయకులను తొలగించి, ఇతర యూనియన్ ల నుంచి వచ్చిన పైరవి కారులను లంచ గొండులను, సకల జనుల సమ్మె ను విచ్చినం చేసిన ద్రోహులకు , తెలంగాణ ఉద్యమ కాలం లో వ్యతిరేకంగా పని చేసే వారికి యాజమాన్యం దగ్గర తొత్తులకు యూనియన్ ముఖ్య మైన పదవులు అప్పగించి సింగరేణి లో అక్రమ వసూళ్ల దందాకు తెర లేపారు. ప్రతీ చిన్న పనికి రేట్ పెట్టి వసూలు చేసుకున్నారు.

సింగరేణి లో ట్రేడ్ యూనియన్ లు చేయాల్సిన పని ని కమర్షియల్ గా, మార్కెట్ గా మార్చారు.

ఇక సింగరేణి లో కార్మిక నాయకుల ను కలవడం కంటే ఏ పని జరుగలన్నా రాజ కీయ నాయకులను కలిసి మాట్లాడించు కోవాలనే ఆలోచన కార్మికులలో కలుగ జేసిండ్లు. 2018 లో శ్రీరాంపూర్ సింగరేణి ఏరియాలో కెసిఆర్ సభ ఏర్పాటు చేసి సభకు కార్మికులను హాజరు పర్చలనే ఉద్దేశ్యం తో రెండు రీజయన్ లలోని 7డివిజన్ కార్మికులకు సెలువు ప్రకటించారు. ఇంతకంటే మించి రాజకీయ జోక్యం ఏ పరిశ్రమ లో ఉండదని చెప్ప వచ్చు. బి ఆర్ ఎస్ హయాం లో లాభాలవాటా ప్రకటించి నప్పుడు కానీ, ఇతర సౌకర్యాలు కల్పించి నప్పుడు కానీ సి. ఎం తో సి ఎం డి, అధికారులు పాల్గొనే వారు కానీ ఎప్పుడు గుర్తింపు సంఘం నాయకులను ఆహ్వానించలేదు. అయితే కాంగ్రేస్ ప్రభుత్వం అందుకు మినహాయింపు ప్రతీ సారి కార్మిక నాయకులను ఇలాంటి సందర్భం లో ఆహ్వానిస్తున్నారు. గత సర్కారు రాజకీయ జోక్యం తో ఏమి చేసిన చెల్లుతుందన్నట్లు వ్యవహరించారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్ పట్టించుకోలేదు. గెలిచిన సంఘం నుంచి 8మంది మాత్రమే చర్చల నెగోశేషియన్ సభ్యులుగా ఉండాలి. కానీ 11మెన్ కమిటీని వేసి వాళ్ళ ఇష్టమున్నట్లు 11మందికి పెంచారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు కూడ 2015తర్వాత అడ్డు అదుపు లేకుండ ఏట ఒకే సారి 5మిలియన్ టన్నులు పెంచుతూ వచ్చారు. టార్గెట్ లను చేరు కున్నామని చెప్పేందుకు గత స్టాక్ లను చూపించడం కోసం లెక్కల్లో తేడాలను చూపి మళ్ళీ జరిగే ఉత్పత్తి తో సరిచేయడం లాంటి చర్యలకు పూనుకున్న స్థితి నడిచింది. రాష్ట్రం లో 2023డిసెంబర్ లో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ కూడ సింగరేణి లో అదే రాజకీయ జోక్యాన్ని కొన సాగిస్తున్నది. లక్ష్యాలు సాధించామనే గొప్పలకు పోయి బొగ్గు స్టాక్ లెక్కల్లో పొరపాట్లు చూపియాల్సి వచ్చింది. ఇటీవల సింగరేణి ప్రతిష్టా త్మక పాజెక్ట్ నైని బ్లాక్ టెండర్ల విషయం లో రాజకీయ జోక్యం ప్రచారం కావడం తో అటు కాంగ్రేస్ ప్రభుత్వానికి, సంస్థ కు ఇబ్బందికర పరిణామాలు ఏర్పడ్డాయి. కెసిఆర్ జెన్ కో ఎం డి ని ఎంతో పొగిడే వారు విధ్యుత్ విషయం లో కానీ జెన్ కో నుంచి సింగరేణి కి రావాల్సిన బకాయిలను వారు చెపుతున్నదే 7వేల కోట్లు ఇప్పించలేక పోయారు. కాంగ్రెస్ హయాం లో అవి 19వేల కోట్ల బకాయిల కు పెరిగాయి.రావాల్సినవి బకాయిలు ప్రభుత్వాలు ఇప్పించక సింగరేణిని ఆర్థిక సంక్షోభం లోకి నెట్టడం జరుగుతున్నది.మొత్తం సింగరేణి కి ప్రభుత్వం నుంచి రావాల్సిన 49వేల బకాయిల కోసం అన్ని సంఘాలు సంస్థలు ఆందోళనలకు దిగడం ప్రభుత్వాలు ఇరకాటం లో పడ్డాయి. ఒక వైపు సింగరేణి లో రాజకీయ జోక్యం పెరిగి సంస్థ ఇబ్బందులకు, సంక్షోబానికి గురవు తున్నట్లు ఆందోళన జరుగుతుంటే, సింగరేణి కోలు కోలేనంత ఆర్థిక బాధల్లో ఉందన్న సంగతి వెల్లడవుతుండ గా ఇదే అధను గా రాజ కీయ పార్టీలన్నీ సింగరేణి పై పడ్డాయి. వాటి కార్యాచరణ లన్ని కోల్ బెల్ట్ లోని సింగరేణి బొగ్గు బాయిల మీదనుంచి మొదలు పెట్టి ఎవరికీ తోచిన విదంగా వారు దుమ్మెత్తి పోస్తు ప్రచారాలకు దిగు తున్నారు.బి ఆర్ ఎస్ నేత హరీష్ రావు చే టి బి జి కే ఎస్ అన్ని ఏరియాలలో సదస్సు లు పెట్టి పవర్ ప్రజెంటేషన్ లు ఇప్పించగా, టి ఆర్ ఎస్ నాయకురాలు కవిత హెచ్ ఎం ఎస్ తో కలిసి బాయి బాట కార్యక్రమం పెట్టి అన్ని ఏరియా లో తిరిగింది. బీజేపీ, బి ఎం ఎస్ లు సభలు పెట్టడమే కాక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డైరెక్టర్స్ తో సమావేశం పెట్టి సంస్థ పనితీరు సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క 300మంది కి నియామక పత్రాలు ఇస్తూ మంచిర్యాల లో సమావేశం నిర్వహించారు. సి పి ఐ ఇటీవల కోల్ బెల్ట్ వ్యాప్తంగా జాత నిర్వ హించారు. కొత్త గా యూనియన్ పెట్టిన టి జి బి కే ఎస్ నేత కేంగర్ల మల్లయ్య సైతం సింగరేణిలో కార్మికుల్లో ప్రచారం చేస్తూ సింగరేణి ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇక్కట్లను వివరిస్తున్నారు. అందరూ సింగరేణి పరి రక్షణ కోసమే నని చెప్పుతున్నారు. సింగరేణిని సంక్షోభం నుంచి గట్టెక్కించి మరో నూరేళ్ల సంస్థ ను నడిపే విధంగా ప్రణాళికలు చేపట్టడం లేదు. అధికార రాజకీయ సంస్థ లు సింగరేణి పై అధిపత్యం చేలాయించాలనే చూస్తున్నాయి. రాజ కీయ జోక్యాన్ని తగ్గించి సింగరేణి పురోబి వృద్ధి కి యాజమాన్యం తో కలిసి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరమున్నది.



## ప్రతి రోజు రూ.50 ఆదా చేస్తే చాలు.. గ్యారంటీగా మీ చేతికి రూ.30 లక్షలు..!

దీవర్ ౧ాఎష్ట్రవఎవ: ప్రస్తుత కాలంలో నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మాత్రమే జీతం పొందే ఉద్యోగులు, కార్మికులు, చిన్న వ్యాపారులు భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం సహజం. అయితే, ప్రతిరోజూ కేవలం రూ.50 మాత్రమే ఆదా చేసినట్లయితే.. డబ్బు సంపాదించేందుకు రకరకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. అందులో తక్కువ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఎక్కువ రాబడి వచ్చేలా ప్లాన్ తీసుకోవచ్చు. ప్రస్తుత కాలంలో నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మాత్రమే జీతం పొందే ఉద్యోగులు, కార్మికులు, చిన్న వ్యాపారులు భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం సహజం. అయితే, ప్రతిరోజూ కేవలం రూ.50 మాత్రమే ఆదా చేసినట్లయితే మీకు మెచ్యూరిటీ సమయంలో లక్షలాది రూపాయలు కూడబెట్టుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. రోజుకు కేవలం రూ.50 అంటే నెలకు రూ.1,500 మాత్రమే ఆదా చేయగలిగితే చాలు. ఈ మొత్తాన్ని 25 లేదా 30 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పెట్టుబడిగా పెట్టడం ప్రారంభిస్తే, భవిష్యత్తులో మంచి నిధిని సృష్టించుకోవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (ౡాఖీ) వంటి సురక్షితమైన పొదుపు పథకాన్ని ఎంచుకోవచ్చు. ఈ స్కీమ్‌లో ప్రస్తుతం వార్షికంగా 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. మీరు డబ్బుకు ఎలాంటి రిస్క్ ఉండదు. పోస్టల్ అధికారుల ప్రకారం.. ఒక వ్యక్తి 25 ఏళ్ల వయసులో నెలకు రూ.1,500 చొప్పున పీపీఎఫ్‌లో పెట్టుబడి పెట్టి, దానిని 60 ఏళ్ల వయసు వరకు నిరంతరాయంగా కొనసాగిస్తే మొత్తం 35 సంవత్సరాల్లో అతను పెట్టే అసలు పెట్టుబడి కేవలం రూ.6.30 లక్షలు మాత్రమే అవుతుంది. అయితే చక్రవడ్డీ (జశీఎజూశీబఅఎఅఅస్త్ర) ప్రభావంతో ఆ పెట్టుబడిపై దాదాపు రూ.23 లక్షలకు పైగా వడ్డీ చేరి, రిటైర్మెంట్ సమయానికి మొత్తం నిధి సుమారు రూ.30 లక్షలకు చేరే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో సగటున 12 శాతం వరకు రాబడి వస్తే, నెలకు రూ.1,500 పెట్టుబడి 30 ఏళ్లలో సుమారు రూ.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్ల రాబడులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల లాభాలకు హామీ ఉండదు రిటైర్మెంట్ తర్వాత చేతికి వచ్చే రూ.30 లక్షల మొత్తాన్ని పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (వీ౫ూ) లేదా సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (౧ాజుూ) వంటి పథకాలలో పెట్టుబడి పెడితే, ప్రతి నెలా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.




## మళ్లీ అదే జోరు.. వారంలో బంగారం ధర ఎంత పెరిగిందో తెలిస్తే షాకవుతారు.. తాజా రేట్ల వివరాలు!

గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు క్రమంగా దిగి వస్తున్న క్రమంలో ఉన్నట్టుండి మళ్లీ పరుగులు పెడుతున్నాయి. గత కొన్ని రోజులుగా దేశీయంగా పసిడి ధరలు రికార్డు స్థాయిలో పడిపోతుండటం ధరల నుంచి ఉపశమనం పొందుతున్న మహిళలకు ఇప్పుడు.. బంగారం, వెండి ధరలు నిరంతరం కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఈ వారం బంగారం ధర రూ.6,000కు పైగా, వెండి ధర రూ.17,000కు పైగా పెరిగింది. వీజశలో 10 గ్రాముల బంగారం ధర రూ.1.47 లక్షలకు, కిలో వెండి ధర రూ.2.40 లక్షలకుపైగా ఎగబాకింది. ఇప్పుడు బంగారం



కొనడం తెలివైన పనా, లేక ధరలు తగ్గే వరకు వేచి ఉండాలా అన్నదే అతిపెద్ద ప్రశ్న. తాజాగా జూలై 5వ తేదీన బంగారం, వెండి ధరలను పరిశీలిస్తే. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,730 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,500 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే కిలో ధర రూ.2,50,000 వద్ద ట్రేడవుతోంది. ఈ రోజు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,46,880 ధరతో, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,34,650 ధరతో ఉంది.

# అయ్యయ్యో.. ఐటీ షేర్లు

- దేశీయ స్టాక్ మార్కెట్లలో సాఫ్ట్‌వేర్ స్టాక్స్ కుదేలు
- టీసీఎస్ సహా టాప్-5 కంపెనీల మార్కెట్ విలువ రూ.18.15 లక్షల కోట్లే
- గడిచిన రెండేండ్లలో దాదాపు 50% పతనం
- అమ్మకాల ఒత్తిడిలో మదుపర్లు

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఐటీ షేర్లు అత్యంత నిరాదరణకు గురవుతున్నాయి. ఇండస్ట్రీని కృత్రిమ మేధస్సు (ఏఐ) భయాలు వెంటాడుతుండగా.. ఇంచుమించుగా గడిచిన రెండేండ్లలో టాప్-5 ఐటీ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు సగానికి హరించుకుపోవడం గమనార్హం. 2024 ఆగస్టులో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా కంపెనీల మార్కెట్ విలువ కలిపితే గరిష్ఠంగా రూ.33.71 లక్షల కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం రూ.18.15 లక్షల కోట్లకే పరిమితమైంది. ఈ రెండేండ్లలో 46 శాతానికిపైగా నష్టాలను మూటగట్టుకున్నాయి. ఐటీ షేర్లలో పెట్టుబడులు గత కొన్నాళ్లుగా మదుపర్లను నిండా ముంచుతున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, స్థూల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, విదేశీ మార్కెట్లలో బలహీనపడ్డ డిమాండ్, మందగించిన ప్రాజెక్టుల కదలికలు అన్నీ కూడా ఐటీ సంస్థలను ఆర్థికంగా ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ఏఐ సేవలు, తద్వారా ఐటీ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు సైతం.. పరిశ్రమను ఇరకాటంలో పడేస్తున్నాయి. ఈ క్రమంలోనే రేటింగ్స్ ఏజెన్సీలు ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాలను నిరాశాజనకంగా అంచనా వేస్తున్నాయి. ఈ ప్రభావం అంతిమంగా స్టాక్ మార్కెట్లలోని ఆయా కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పైనే పడుతున్నది. భారతీయ ఐటీ సేవల




సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో పేలవమైన ఆర్థిక ఫలితాలనే ప్రకటించవచ్చని జేపీ మోర్గాన్, జేఎం ఫైనాన్షియల్ అంచనా వేస్తుండటం.. ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. తాజా అంచనాల మధ్య ఈ నెల 9న విడుదల కానున్న టీసీఎస్ ఆర్థిక ఫలితాలు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి.

### అమెరికా దెబ్బ

అమెరికాలో ట్రంప్ సర్కార్ నిర్ణయాలు సైతం భారతీయ ఐటీ ఇండస్ట్రీని కుదేలు చేస్తున్నాయి. ఇప్పటికే దేశీయ ఐటీ కంపెనీల అమెరికా ఆదాయానికి గండికొట్టిన ట్రంప్.. వీసా నిబంధనల కఠినతరంతో ఇక్కడి ఉద్యోగావకాశాలనూ పరిమితం చేసేశారు. నిజానికి దేశీయ ఐటీ సంస్థలకు విదేశీ ప్రాజెక్టుల ద్వారానే ప్రధానంగా ఆదాయం చేకూరుతున్నది. కానీ అమెరికాతోపాటు, ఐరోపా దేశాల్లోనూ ఆదాయం ఇటీవలికాలంలో తగ్గిపోతున్నది. ఇందుకు ఏఐతోపాటు స్థానిక విధానాలూ కారణమే. ఇక విదేశీ ఐటీ సంస్థల వ్యాపారావకాశాలూ నీరసంగానే ఉన్నాయి. ఏప్రిల్-జూన్‌లోనూ యాక్సెంచర్ ఆర్థిక ఫలితాలు, గైడెన్స్ నిరాశాజనకంగానే ఉండొచ్చన్న అంచనాలున్నాయి మరి.

### మార్కెట్ లీడర్‌గా రిలయన్స్

రిలయన్స్ ఇండస్ట్రీస్.. భారతీయ స్టాక్ మార్కెట్లలో లీడర్‌గా కొనసాగుతున్నది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఈ సంస్థ మార్కెట్ విలువ ఇప్పుడు రూ.17.65 లక్షల కోట్లుగా ఉన్నది. నిజానికి 2024 జూన్‌లో రూ.21.20 లక్షల కోట్లుగా ఉండేది. ఈ రెండేండ్లలో షేర్ వాల్యూ 16.7 శాతం క్షీణించింది. అయినప్పటికీ దేశీయ టాప్-5 ఐటీ సంస్థల మార్కెట్ విలువ ఒకెత్తు.. రిలయన్స్ విలువ ఒకెత్తుగా ఉండటం విశేషం. రిలయన్స్ మార్కెట్ విలువతో పోల్చితే టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రాలన్నింటి మార్కెట్ విలువ రూ.50వేల కోట్లు మాత్రమే ఎక్కువ.

## క్వార్టర్స్‌కు ఫ్రాన్స్

# పరాగ్వేను ఓడించి ముందంజ






### ఎంబాపె ఖాతాలో ఏడో గోల్

ఫిలాడెల్ఫియా (యూఎస్): రెండుసార్లు ప్రపంచ చాంపియన్ ఫ్రాన్స్ ఫిఫా వరల్డ్ కప్ క్వార్టర్స్‌కు ప్రవేశించింది. ఆ జట్టు సారథి కిలియన్ ఎంబాపె ఈ టోర్నీలో ఏడో గోల్‌తో మాజీ చాంపియన్‌కు మరో విజయం అందించి తన జట్టు ముందంజ వేయడంలో కీలకపాత్ర పోషించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటలకు జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్.. 1-0తో పరాగ్వేను ఓడించి వరుసగా నాలుగోసారి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. అత్యంత నాటకీయంగా సాగిన పోరులో స్టార్ స్ట్రైకర్ ఎంబాపె మాత్రమే ఏకైక గోల్ కొట్టాడు. ఈ విజయంతో ఫ్రాన్స్.. గురువారం జరిగే క్వార్టర్స్ పోరులో మొరాకోను ఢీకొననుంది. ఖతార్ ప్రపంచకప్‌లో ఇవే రెండు జట్ల మధ్య జరిగిన సెమీస్‌లో మొరాకో.. ఫ్రాన్స్ చేతిలో అపజయం పాలైంది.

### పరాగ్వే చెత్త ఆట

రౌండ్-32లో అగ్రశ్రేణి జట్టు జర్మనీని షూటౌట్‌లో ఓడించిన పరాగ్వే.. ప్రిక్వార్టర్స్‌లో మాత్రం చెత్త ఆట ఆడింది. మ్యాచ్‌లో గోల్స్ చేయడం కంటే ప్రత్యర్థి జట్టు సారథితో పాటు ఇతర ఆటగాళ్లను కవ్విస్తూ వారితో వాగ్వాదానికి దిగడం, భౌతికంగా దాడులకు దిగడంపైనే దృష్టి సారించింది. దీంతో మ్యాచ్‌లో పలుమార్లు ఇరుజట్ల మధ్య ఘర్షణ జరిగి ఉద్రిక్తతలకు దారితీసింది. ముఖ్యంగా ఎంబాపెను లక్ష్యంగా చేసుకున్న ఆ జట్టు అతడి ఏకాగ్రతను దెబ్బతీసేందుకు వేయాల్సిన ఎత్తులన్నీ వేసింది. ఇక పరాగ్వే గిల్లికజ్జాలకు పాల్పడినా ఫస్టాఫ్‌లో 85 శాతం బంతిని తమవద్దే ఉంచుకున్నా ఫ్రాన్స్ మాత్రం గోల్ చేయలేకపోయింది. సెకండాఫ్ మొదలయ్యాక కొద్దిసేపటికే ఎంబాపె.. పరాగ్వే గోల్ పోస్ట్‌కు సమీపంలో కార్నర్ వరకూ వచ్చినా దానిని గోల్‌గా మలచడంలో అతడు విఫలమయ్యాడు. 55వ నిమిషంలో మన్ను కొనె ప్రయత్నం కూడా ఫలించలేదు. తొలి అర్ధభాగం మొత్తం ఆ జట్టు గోల్స్ కొట్టకుండా అడ్డుకోవడంలో పరాగ్వే గోల్‌కీపర్ ఒర్లాండో గిల్ అడ్డుగోడలా నిలబడ్డాడు.

### కిలియన్ మ్యాజిక్

సుమారు గంటకు పైగా ఫ్రాన్స్‌ను గోల్ చేయకుండా నిలువరించడంలో విజయవంతమైన పరాగ్వే తర్వాత డియాగో గొమెజ్ చేసిన తప్పిదంతో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. బంతిని ప్రత్యర్థి రక్షణశ్రేణిని దాటుకుని గోల్ వైపుగా దూసుకువస్తున్న ఫ్రాన్స్ ఆటగాడు డిజిరె డుయెకు గొమెజ్ అడ్డుపడటంతో ఎంబాపె సేనకు పెనాల్టీ లభించింది. దీనిని ఫ్రాన్స్ కెప్టెన్ రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని తెలివిగా వలలోకి నెట్టేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత పరాగ్వే గేరు మార్చి ప్రత్యర్థి గోల్‌పోస్ట్ పైకి ఎదురుదాడికి దిగినా ఫలితం లేకపోయింది. నిర్ణీత సమయంతో పాటు ఎక్స్‌ట్రా టైమ్‌లోనూ పరాగ్వే గోల్ చేయకపోవడంతో ఫ్రాన్స్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పరాగ్వే ఆటగాళ్లు నానా రచ్చ చేసిన మ్యాచ్‌లో ఆ జట్టు ప్లేయర్లకు ఒక్కటంటే ఒక్క ఎల్లో కార్డు రాకపోగా ఫ్రాన్స్‌కు మాత్రం మూడు పసుపు కార్డులు రావడం కొసమెరుపు.

### గోల్డెన్ బూట్ రేసులో..

సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనా దిగ్గజం మెస్సీ, ఫ్రాన్స్ స్ట్రైకర్ ఎంబాపె మధ్య రసవత్తరంగా సాగుతున్న గోల్డెన్ బూట్ రేసు ఆదివారం నాటి మ్యాచ్‌తో తారాస్థాయికి చేరింది. పరాగ్వే మ్యాచ్‌లో గోల్‌తో కిలియన్ కూడా ఏడు గోల్స్‌తో అర్జెంటీనా సారథితో సమంగా నిలువడం గమనార్హం. ఖతార్ ఎడిషన్‌లో ఎంబాపె (8 గోల్స్)నే గోల్డెన్ బూట్ వరించింది. తాజా టోర్నీలో భాగంగా ఈ రేసులో ఈ ఇద్దరి తర్వాత ఎర్లింగ్ హాలెండ్ (నార్వే-5), హ్యారీ కేన్ (ఇంగ్లండ్-5), ఒస్మాన్ డెంబెలె (ఫ్రాన్స్-2) టాప్-5లో ఉన్నారు. ఇక ఓవరాల్‌గా ఆరు వరల్డ్‌కప్స్‌లో మెస్సీ ఖాతాలో 20 గోల్స్ ఉండగా 19 మ్యాచ్‌లే ఆడిన ఎంబాపె.. 19 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు.



# భారత్-ఏ ఘనవిజయం

### గుర్నూర్‌కు పది వికెట్లు

శ్రీలంక పర్యటనలో భారత్-ఏ జట్టు అదరగొట్టింది. ఇరుజట్ల మధ్య ఆదివారం ముగిసిన రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ.. శ్రీలంక-ఏపై 10 వికెట్ల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టిన భారత పేసర్ గుర్నూర్ బ్రర్.. రెండో ఇన్నింగ్స్‌లో (6/68) ఆరు వికెట్లు తీసి పర్యాటక జట్టుకు ఘనవిజయాన్ని అందించాడు. నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌ను 543/9 వద్ద భారత్ డిక్లేర్డ్ చేయగా రెండో ఇన్నింగ్స్‌లో లంకేయులు 209 రన్స్‌కే కుప్పకూలారు. 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జురెల్ సేన వికెట్లేమీ కోల్పోకుండానే ఛేదించింది.



# అమ్మాయిల కప్పు ఆసీస్‌దే

- ఇంగ్లండ్‌కు మళ్లీ నిరాశ

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్పును ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా ఏడోసారి కైవసం చేసుకుంది. ఆదివారం లార్డ్స్ వేదికగా పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆసీస్.. 7 వికెట్ల తేడాతో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఓడించి రికార్డుస్థాయిలో ఏడోసారి కప్పును ముద్దాడింది. ముందు బంతితో ఇంగ్లిష్ జట్టును కట్టడిచేసిన కంగారూలు.. తర్వాత బ్యాట్‌తో రెచ్చిపోయి ఆడారు. ప్రత్యర్థి నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యాన్ని మోలినో సేన.. 17.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. బెత్ మూనీ (49 బంతుల్లో 10 ఫోర్లతో 64), ఫొబె లిచ్‌ఫీల్డ్ (35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48) దూకుడుగా ఆడారు. అంతకుముందు ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. ఆసీస్ బౌలర్లు కట్టడిచేయడంతో నిర్ణీత ఓవర్లలో 150/4కే పరిమితమైంది. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (53 బంతుల్లో 5 ఫోర్లతో 58 నాటౌట్) అర్ధ శతకంతో జట్టును ఆదుకోగా ఫ్రెయా కెంప్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 44 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరును సాధించింది. కాగా టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఆసీస్ చేతిలో ఓడటం ఇంగ్లండ్‌కు ఇది నాలుగో (2012, 2014, 2018 తర్వాత)వది కావడం గమనార్హం. 2009 తర్వాత రెండోసారి టైటిల్ సాధించాలన్న ఇంగ్లండ్‌కు మరోసారి నిరాశే ఎదురైంది.

# మళ్లీ బాబర్‌కే పగ్గాలు




పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మళ్లీ ఆ జట్టును నడిపించబోతున్నాడు. మూడేండ్ల క్రితం సారథ్య పగ్గాలు కోల్పోయిన బాబర్.. తన స్థానంలో నియమితుడైన షాన్ మసూద్ చేతి నుంచే మళ్లీ టెస్టు కెప్టెన్సీని దక్కించుకున్నాడు. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా రాబోయే వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనలకు జట్టును ప్రకటించగా మసూద్‌ను తప్పించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోమారు బాబర్‌నే నాయకుడిగా నియమించింది. సొంతగడ్డపై బంగ్లాదేశ్ సిరీస్‌ను 0-2తో ఓడిన నేపథ్యంలో మసూద్‌పై వేటు తప్పలేదు. అతడి నాయకత్వంలో పాక్.. 16 టెస్టులాడితే 12 ఓడింది. ఇక రానున్న విండీస్, ఇంగ్లండ్ టూర్లకు పీసీబీ.. స్టార్ పేసర్లు షహీన్ షా అఫ్రిది, హసన్ అలీ, నోమన్ అలీలను పక్కనబెట్టింది.



# మిస్టీరియస్ కిల్లర్

స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ స్పై థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఆదివారం హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రం నుంచి ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూపర్, మిస్టీరియస్ ఉమెన్‌గా కనిపిస్తున్న జ్యోతి పూర్వాజ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు.



# ఆ తెలుగు హీరోతో లింక్ చేయడంతో ఓపెన్ స్టేట్మెంట్ ఇచ్చిన త్రిష..

రానా దగ్గుబాటితో తన స్నేహం గురించి నటి త్రిష కృష్ణన్ మాట్లాడారు. తమకు 18 ఏళ్ల వయస్సు నుంచే పరిచయం ఉందని, అది అప్పుడప్పుడూ గొడవలతో కూడిన లవ్-హేట్ సంబంధమని పేర్కొన్నారు. రానా లేడీస్ మ్యాన్ అయినప్పటికీ, అతను అందరినీ గౌరవించే, మర్యాదగా ప్రవర్తించే నిజమైన జెంటిల్‌మన్ అని త్రిష వెల్లడించారు. ప్రముఖ నటి త్రిష కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నటుడు రానా దగ్గుబాటితో తనకున్న సుదీర్ఘ అనుబంధం గురించి బహిరంగంగా మాట్లాడారు. సినీ వర్గాల్లో వారి మధ్య స్నేహం, బంధం గురించి తరచుగా చర్చలు జరిగే నేపథ్యంలో, త్రిష తన వ్యక్తిగత దృక్పథాన్ని పంచుకున్నారు. రానాతో తన పరిచయం ఎప్పటికీ ముగియని కథ అని ఆమె అభివర్ణించారు, ఇది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆన్-అండ్-ఆఫ్ స్నేహమని తెలిపారు. త్రిష, రానా ఇద్దరూ దాదాపు 18 ఏళ్ల వయస్సు నుంచే ఒకరికొకరు తెలుసునని పేర్కొన్నారు. "మేము పక్కింటి వాళ్ళం. నేను టి. నగర్‌లోని మా పాత ఇంట్లో ఉన్నప్పుడు, రామానాయుడు గారి ఇల్లు మాకు ఎదురుగా ఉండేది. రానా కూడా దాదాపు చెన్నైలోనే పెరిగాడు," అని త్రిష గుర్తు చేసుకున్నారు. ఆ విధంగా చిన్ననాటి నుంచే వారిద్దరి మధ్య స్నేహం మొదలైందని, ఈ బంధంలో ఎన్నో దశలు ఉన్నాయని ఆమె వివరించారు. కొన్నిసార్లు మంచి స్నేహితులుగా ఉన్నామని, మరికొన్నిసార్లు అస్సలు మాట్లాడుకోని దశలు కూడా ఉంటాయని అన్నారు. ఈ సుదీర్ఘమైన, సంక్లిష్టమైన బంధాన్ని త్రిష "లవ్-హేట్ రిలేషన్‌షిప్"గా వర్ణించారు. రానా దగ్గుబాటిని లేడీస్ మ్యాన్‌గా తరచుగా అభివర్ణించే విషయంపై త్రిష స్పష్టత ఇచ్చారు. "అతను లేడీస్ మ్యాన్, అది వేరే విషయం. అది నిజమే. అందులో సందేహం లేదు. అతను లేడీస్ మ్యాన్," అని ఆమె ధృవీకరించారు. అయితే, రానా గురించి తనకు అత్యంత నచ్చే విషయం ఏమిటంటే, అతని మర్యాదపూర్వకమైన, పద్ధతిగా ఉండే ప్రవర్తన అని త్రిష స్పష్టం చేశారు. "అతను చాలా గ్రేషియస్ మనిషి. చాలా, చాలా గ్రేషియస్. అది నేను చెప్పాల్సిన ఒక విషయం. నేను అతనితో మాట్లాడుతున్నానా, లేదా, మా మధ్య ఏదైనా గొడవ జరుగుతున్నా, అతను చాలా బాగా ప్రవర్తిస్తాడు, చాలా పద్ధతిగా ఉంటాడు," అని త్రిష అన్నారు. రానా జనాలకు ఇచ్చే గౌరవం తనకు చాలా నచ్చుతుందని, అందరి పట్ల చాలా గౌరవం ఉందని ఆమె పేర్కొన్నారు. రానా దగ్గుబాటి వ్యక్తిత్వాన్ని వివరిస్తూ, త్రిష అతను నిజమైన జెంటిల్‌మన్ అని, ఎటువంటి సందేహం లేదని అన్నారు. రామానాయుడు గారి కుటుంబం నుంచి వచ్చినా, అతనికి ఎలాంటి గర్వం లేదని తెలిపారు. "అతను... అతను సంప్రదాయాలకు కట్టుబడి కాకుండా, తనకు నచ్చినట్లు జీవించాలని భావిస్తాడు." అని త్రిష వ్యాఖ్యానించారు.

## సినిమా ఇండస్ట్రీలో తిరుగులేని నటి.. అత్తవారింటి వేధింపులు,ఆర్థిక ఇబ్బందులతో జీవితం అతలాకుతలం





నటి, గాయని ఎస్. వరలక్ష్మి సినీ ప్రస్థానం, వ్యక్తిగత జీవితం ఎంతో వైవిధ్యభరితం. బాలనటిగా అరంగేట్రం చేసి అగ్రతారగా ఎదిగారు. స్వంత నిర్మాణంతో ఆర్థికంగా నష్టపోయారు. మానసిక వికలాంగుడైన కుమారుడి ఆలనా పాలన, భర్త మరణం, అత్తవారింటి వేధింపులతో ఆమె జీవితం నరకప్రాయమైంది. తెలుగు సినీ చరిత్రలో తన బహుముఖ ప్రతిభతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నటి ఎస్. వరలక్ష్మి. ఆమె జీవితం తెర వెనుక విషాద గాథ. నటిగా, గాయనిగా, సంగీత విద్వాంసురాలిగా అపారమైన కీర్తిని సంపాదించిన ఆమె వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, పోరాటాలు ఎందరినో కదిలిస్తాయి. 1927లో తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో నీలాచలం దంపతులకు జన్మించిన వరలక్ష్మి బాల్యం నుంచే కష్టాలను చూశారు. ఆడపిల్లలంటే అసహ్యించుకునే తండ్రి వేధింపుల నుంచి ఆమెను పెద్దమ్మ, రంగయ్య నాయుడు కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ రంగయ్య నాయుడు దగ్గర సంగీతం నేర్చుకుంటూ పెరిగారు. ఒకరోజు కర్నూలుకు వచ్చిన ప్రముఖ దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం ఆమె పాట విని బాలయోగిని (1937) చిత్రంలో అవకాశం కల్పించారు. అక్కడి నుంచి ఆమె సినీ ప్రయాణం మొదలైంది. కే. సుబ్రహ్మణ్యం తీసిన సేవా సదనం (1938)లో చిన్ననాటి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్రలో నటించి మెప్పించారు. ఆ తర్వాత రైతుబిడ్డ, ఇల్లాలు వంటి చిత్రాలలో చిన్న పాత్రలు చేశారు. కమలా కోట్నీస్ నిరాకరించిన పాత్రలో కే. సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో మాయాలోకం చిత్రంలో మూడవ కథానాయికగా నటించే అవకాశం వరలక్ష్మికి వచ్చింది. అప్పటికే ఆమె రేడియోలో పాటలు పాడుతూ మంచి పేరు తెచ్చుకున్నారు. మాయాలోకం చిత్రం ఘన విజయం సాధించడంతో ఆమె పేరు మారుమోగిపోయింది. ఆ తర్వాత ఘంటసాల బలరామయ్య దర్శకత్వంలో అక్కినేని నాగేశ్వరరావుతో కలిసి నటించిన బాలరాజు (1948) చిత్రం సంచలనం సృష్టించి రికార్డు విజయం సాధించింది. అక్కడి నుంచి ఆమె కెరీర్ వెనుదిరిగి చూడలేదు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust
Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020